
# భువనేశ్వరి దేవి అలంకరణతో భక్తులకు దర్శనం



**పెన్ పవర్, కంభం అక్టోబర్ 5**

కంభం లో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శనివారం శ్రీ భువనేశ్వరి దేవి రూపంలో దర్శనం ఇచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వడం జరుగుతుంది. సకల శుభాల విజయాలు అమ్మవారి దివ్యదర్శనం ద్వారా మనకు లభిస్తాయి. నవగ్రహ జపములు రుద్రాభిషేకం పలు కార్యక్రమాలు నిర్వహించారు. మానవుల కష్టాలను తొలగించి సకల సౌభాగ్యాలు భక్తులకు ప్రసాదించేందుకు పాటుపడునని అమ్మవారిని దర్శించుకున్న భక్తులంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారి దీవెనలు ఉంటాయని ప్రతి ఒక్కరి నమ్మకం .అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు దర్శించుకునేందుకు వస్తున్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారికి తీర్థప్రసాదాలు అందజేయడం జరుగుతుంది. దేవాలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

10 YEAR ANNIVERSARY 2014 - 2024
పెన్ పవర్
గుంటూరు పల్నాడు తిరుపతి
బాపట్ల । ప్రకాశం । నెల్లూరు

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు

# నాణ్యమైన విద్యను అందించాలి

### కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో సాగుతున్న విద్యాబోధనపై అందుతున్న ఫిర్యాదులు...

### తల్లిదండ్రులకు విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి...

### కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మండల అధ్యక్షురాలు కామూరి అమూల్య...

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 5**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు గట్టి పునాదులు వేయాలని కొమరోలు మండల పరిషత్ అధ్యక్షురాలు కామూరి అమూల్య పేర్కొన్నారు .శనివారం కొమరోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశపుహాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ కావూరి అమూల్య మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించాలని, అందుకు తగినట్లుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన కొరవడుతున్నట్లుగా, దీనితో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారని ఆమె చెప్పారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో విద్యాబోధన కుంటుపెడుతున్నదని ,ముఖ్యంగా గణితం బోధించే ఉపాధ్యాయుడు తన సబ్జెక్టును సక్రమంగా బోధించడం లేదని, తల్లిదండ్రులు విద్యార్థులు అడిగే ప్రశ్నలకు ఆ ఉపాధ్యాయుడు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లుగా పలువురు తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేశారని ఆమె తెలుపుతూ ,సమావేశానికి హాజరైన మండల విద్యాశాఖ అధికారి కి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి 2 వెంకటరత్నం మాట్లాడుతూ, కొమరోలు మండలంలోని అన్ని జిల్లా పరిషత్ పాఠశాలలు, మండల ప్రాథమిక ప్రాథమిక పాఠశాలలు సక్రమంగా పనిచేస్తున్నాయని, ప్రభుత్వ ఆశయానికి



అనుగుణంగా విద్యాబోధన తోపాటు ,డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతున్నదని ఆయన తెలిపారు .అయితే కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందడం లేదనే సమాచారం తనకు అందలేదని, అందువల్ల ఆ పాఠశాలను సందర్శించి గణితం తో పాటు మిగిలిన అన్ని సబ్జెక్టులను ఉపాధ్యాయులు సక్రమంగా బోధించే విధంగా చర్యలు తీసుకుంటానని సమాధానం చెప్పారు. కొమరోలు మండలంలో గత మూడు సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఎంపీటీసీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో ఎంపీటీసీలు ప్రజల విజ్ఞప్తి మేరకు సొంత డబ్బులతో అరకొర అభివృద్ధి



పనులు చేయవలసి వస్తుందని కొమరోలు ఎంపీటీసీ సభ్యులు ఎస్ఎం సుభాని నిరసన, ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నారని వాటికి ఎంపీటీసీలు హాజరవుతూ, మండలంలో జరగవలసిన అభివృద్ధి పనులను వివరిస్తూ నిధులు మంజూరు చేయాలని కోరుతున్నప్పటికీ నిధులు మంజూరు కావడం లేదని ఆయన చెప్పారు .కొమరోలు పట్టణంలో మురికి కాలువల పరిస్థితి అధ్వానంగా ఉన్నదని, దీనితో తాను తన సొంత డబ్బుతో మురికి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకున్నానని ఆయన చెప్పారు. కొమరోలు పట్టణంలో లో వోల్టేజ్ సమస్య రోజురోజుకు పెరిగిపోతున్నదని, అదనపు ట్రాన్స్ఫార్మర్ల



ఏర్పాటు చేయాలని గత చాలాకాలంగా విజ్ఞప్తి చేయడమే కాకుండా ,కొత్త ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు స్థలాలు కూడా చూపించామని, అయితే అదనపు ట్రాన్స్ఫర్లో ఏర్పాటు ఎండమావిగా మారిందని ఆయన తెలిపారు .లో వోల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో పలు అంశాలపై జరిగిన సమీక్షలు పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు ,సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు వెంకటేశ్వర రెడ్డి, తిరుపతి రాజు, ఎస్ఎం సుభాని, జాజం వెంకటరమణ తోపాటు పలువురు ఎంపిటిసిలు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాసీం సాహెబ్ ,సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులే

# నిజమైన హీరోలు

### పారిశుద్ధ్య కార్మికులకు పిపిఈ కిట్లు పంపిణీ చేసిన ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్5**

సమాజంలో పారిశుద్ధ్య కార్మికులే నిజమైన హీరోలని స్థానిక శాసనస భ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కందు కూరు పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శనివారం ఉదయం పురపాలక సంఘ కార్యాల యంలో శాసనస భ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పి పి ఈ కిట్ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు చేసిన కర్తవ్య నిర్వహణ శ్లాఘనీయమన్నారు. శానిటేషన్ వర్కర్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అవ్యాజమైన ప్రేమ ఉందన్నారు. పారిశుధ్య కార్మికులకు ఏ కష్టం వచ్చినా, తాము అండగా ఉంటామన్నారు. కందుకూరు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చోట నూతన డస్ట్ బిన్స్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. గత



ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చెత్త మీద పన్ను వేసిన విధానాన్ని ఎమ్మెల్యే దుయ్య బట్టారు. చెత్త పన్నును ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలగించారని గుర్తు చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అనూష మాట్లాడుతూ, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేసినట్లు ఆమె చెప్పారు. వారికి పారిశుద్ధ్యం పై స్లొగన్స్, వ్యాసరచన పోటీలు నిర్వహించి మెమొంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు ముచ్చు శ్రీను, షేక్ రఫీ, వడ్డెళ్ళ రవిచంద్ర, ఇతర నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దశాబ్దాల కల...

# నెరవేరిన వేళ...

### మూడువేల మత్స్యకార కుటుంబాలకు తాగునీటి సమస్యకు పరిష్కారం


### నూతనంగా వాటర్ ప్లాంట్‌లు ప్రారంభం

### రామానంద సరస్వతి స్వా మీజీతో కలిసి వాటర్ ప్లాంట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

**చీరాల, అక్టోబర్ 05,పెన్ పవర్**

దశాబ్దాల కాలంగా, తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న, మత్స్యకారులకు, నూత నంగా ప్రారంభించిన వాటర్ ప్లాంట్ లతో, తాగునీటి సమస్యకు పరిష్కారం దొరక టం ఆనందంగా ఉందని, చీరా ల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య హర్షంవ్యక్తం చేశారు. చీరాల మండలం వాడరేవులో, రామానంద ట్రస్ట్ సహకారంతో నిర్మించిన వాటర్ ప్లాంట్లను, లలితానంద ఆశ్రమ పీఠాధిప తి రామానంద సరస్వతి స్వా మి తో కలిసి, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొం దయ్య ప్రారంభించారు. దీంతో దశాబ్దా ల కాలంగా తాగునీటికోసం, ఇబ్బంది పడుతున్న, 3వేల మత్స్యకార కుటుంబాలకు తాగునీటి సమస్య తీరనుంద ని, ఎమ్మెల్యే





కొండయ్య అన్నా రు. సముద్రతీర ప్రాంతమైన వాడరేవులో, ఉప్పునీటితో దశాబ్దాల కాలంగా, దప్పిక తీర్చే మంచి నీరు దొరకక, తాగునీటి సమస్యతో, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, తాగునీటి కోసం వాడరేవు ప్రజలు తమను కలవడంతో, రామానంద సరస్వతి స్వామీజీ సహకారంతో, నేడు ఈ మంచి కార్యక్రమానికి, ముందడుగు వే యడం జరిగిందన్నారు. వాడ రేవు లో తాగునీటి సమస్యను, శాశ్వతంగా పరిష్కరిస్తామని, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కా ర్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రా మ ప్రజలు, టిడిపి, బిజెపి, జనసేన పార్టీ ల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## జిల్లా ప్రభుత్వ ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా







**చిత్తూరు, పెన్ పవర్ అక్టోబర్ 05 :**
రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయి మెంట్ ఎక్స్చేంజ్, (సీడప్) మరియు డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా సెప్టెంబర్ నెల 05వ తేదిన శుక్రవారం స్థానిక చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా యం. గుణశేఖర్ రెడ్డి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, గోపి జిల్లా ఉపాధి అధికారి, మురళీకృష్ణ ఐ. టి. ఐ కలశాల ప్లేసేమెంట్ అధికారి యుగంధర్ బాబు రీజినల్ ప్లేసేమెంట్ అధికారి మరియూ ఇతర అధికారులు పాల్గొనారు. ఈ జాబ్ మేళాలో వివిధ బహుళ జాతీయ కంపెనీలు ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవసూర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, క్రియ నెస్ట్వాల్ ప్రైవేట్ లిమిటెడ్ మరియ అపోలో ఫార్మర్స్ లిమిటెడ్ వారు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 131 మంది హాజరైయారు. వారిలో 61 ఉద్యోగ అవకాశాలు పొందారు.

## వినాయకుని సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



**కాణిపాకం, పెన్ పవర్ అక్టోబర్ 05 :**
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం శ్రీ స్వామి వారి దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కుమార్ అగర్వాల్, కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసిన సూపర్డెంట్ కోదండపాణి, ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలసిన ఎమ్మెల్యే, ఈవో



**కాణిపాకం, పెన్ పవర్ అక్టోబర్ 05 :**
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డిని తిరుపతి విమానాశ్రయం నందు మర్యాదపూర్వకంగా కలిసి స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేసిన పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ మరియు కాణిపాకం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పట్టెం గురు ప్రసాద్, పాలక మండలి మాజీ చైర్మన్ మణి నాయడు.

## తాసిల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన చిత్తూరు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**చిత్తూరు, పెన్ పవర్ అక్టోబర్ 05:**
చిత్తూరు రూరల్ తహసిల్దార్ కార్యాలయం నకు శనివారం సాయంత్రం ప్రారంభోత్సవం చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్. వీరితోపాటుజిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ బి.పుల్లయ్య, చిత్తూర్ ఆర్డీఓ శ్రీనివాసులు, మాజీ మేయర్ కటారి హేమలత సంబంధిత అధికారులు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



### ఉపాధి హామీ పథకం నిధులతో బర్రెలు,గొర్రెల

# షెడ్ల నిర్మాణాలకు ప్రోత్సాహం

*బర్రెల షెడ్డు నిర్మాణానికి2.30 లక్షల రూపాయలు మంజూరు -90 శాతం ఉపాధి హామీ పథకం నిధులు, 10 శాతం లబ్ధిదారుని వాటా నిధులు.*

*గొర్రెల షెడ్డు నిర్మాణానికి 2.30 లక్షలు రూపాయలు మంజూరు -70% ఉపాధి హామీ పథకం నిధులు 30% లబ్ధిదారుని వాటా నిధులు.*

*కొమరోలు మండలానికి 25 షెడ్లు మంజూరు -కొమరోలు ఇన్చార్జి ఎంపీడీవో మస్తాన్ వలి.*

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్5**
కొమరోలు మండలంలోని బర్రెల గొర్రెల పోషకులు లబ్ధిదారులు పశువుల జంతువుల కొరకు షెడ్లు నిర్మించుకునేందుకు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసి ప్రోత్సహిస్తున్నదని కొమరోలు ఇన్చార్జి ఎంపీడీవో మస్తాన్ వలి తెలిపారు. మండలంలోని బర్రెలు, గొర్రెల పెంపకం లబ్ధిదారులకు షెడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించేందుకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సమావేశానికి ఏపీవో మహాలక్ష్మి దేవి అధ్యక్షత వహించగా ,ఇన్చార్జి ఎంపీడీవో వలి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గొర్రెలు బర్రెల పెంపకం దారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం బర్రెలు, గొర్రెల షెడ్లను మంజూరు చేస్తున్నదని చెప్పారు. కొమరోలు మండలానికి 25 షెడ్లు మంజూరయ్యాయని, బర్రెల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 2.30 లక్షలు రూపాయలు మంజూరు చేస్తుండగా, అందులో ఉపాధి హామీ పథకం నిధులు 90% లబ్ధిదారుని వాటా నిధులు 10 శాతం గా నిర్ణయించారని ఆయన తెలిపారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 2.30 లక్షల రూపాయలు మంజూరు చేస్తుండగా ,వాటిల్లో జాతీయ గ్రామీణ ఉపాధి



హామీ పథకం ద్వారా 70 శాతం నిధులు, లబ్ధిదారుని వాటా 30% నిధులు గా నిర్ణయించారని ఆయన వివరించారు. షెడ్ల నిర్మాణానికి ఉత్సాహం చూపే జంతు, పశుపోషకులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన



తెలిపారు. ఆ కార్యక్రమంలో ఏపీఓ మహాలక్ష్మి దేవి ,ఉపాధి హామీ పథకం ఈసీలు, టిఏలు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి




| SI No | Name of The Company | Job Role | Qualificatins | Job Location | Salary | Vacancies | Gender | Age Limit |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Jaya Lakshmi Maruthi | Sales Executives&Evaluators,Mechanics,Telecallers &,Helpers | 10th,ITI , Diploma & Any Degree | Chirala,Darsi,Kandukur,Markapuram &Ongole | RS.10,000-15,000/-CTC PM | 20 | Male /Female | 19 to 28 Years |
| 2 | Celekt Gadgets LLP | Store Managers,Cashiers& Sales Executives | 10th,ITI ,Inter & Any Degree | Guntur Vijayawada,Tirupathi,Srikalahasthi & pulivendula | Rs. 12,000 to 18,000 CTC/-PM | 30 | Male | 19 to 29years |
| 3 | InnovSource Services Pvt Ltd(SBI Cards) | Relationship Executive (RE), Branch Relationship Executive (BRE), Tele Caller, MIS Executive, TL, BDM, Unit Manager | Inter, Any Degree | Ongole & Prakasam District | Rs. 15,000 to 35,000 CTC Per Month (Based on the previous experience) + Incentives | 50 | Male & Female | 18 to 30 Years |



**ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 5**
జిల్లా ఉపాది కార్యాలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృధి సంస్థ,సీడప్ ఒంగోలు వారి ఆధ్వర్యములో జయలక్ష్మి మారుతి,సెలెక్ట్ గాడ్జెట్స్ యల్ యల్ పి ),ఇన్నోవా సోర్స్ సర్వీసెస్ పివిటి ఎల్టిడి (సిబిఐ కార్డ్స ) కంపెనీ లో "సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, మూల్యాంకనం చేసేవారు, మెకానిక్స్,టెలికాలర్లు %ఇ%, సహాయకులు స్టోర్ మేనేజర్లు, క్యాషియర్లు,సేల్స్ ఎగ్జిక్యూటివ్స్,రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (ఆర్ ఇ),బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (బి ఆర్ ఇ ),టెలి కాలర్, యమ్ స్ ఎగ్జిక్యూటివ్,టి యల్ , బీడీయమ్,యూనిట్ మేనేజర్",సెక్టార్ లలో వివిధ రకాల ఖాళీలను భర్తీచేయుటకు ఏదైనా విభాగంలో ఐ.టి.ఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియేట్ ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసిన వారికి ఇంటర్వ్యూ లు ప్రభుత్వ ఐ టి ఐ (బాలికలు) కళాశాల,ఒంగోలు నందు ఈ నెల 08 వ తేదీన (మంగళవారం ) ఉదయం 10:00 గం.ల నుండి సాయంత్రం 3గం.ల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు జీతం నెలకు 10,000/-నుండి 30,000/- వరకు ప్లస్ పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఇవ్వటం జరుగుతుందని,జిల్లా ఉపాది కార్యాలయం అధికారి టి భరద్వాజ్ తెలిపారు. కావున జిల్లాలోని 18సం,, నుండి 30 సం,,మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఇంటర్వ్యూ కు ఆధార్ కార్డు సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరములకు https://shorturl.at/JPkhx లేదా ఆఫీసు పని సమయాలు 9160797311 లను సంప్రదించగలరని తెలిపారు.

### మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి

## 10,000 చొప్పున 2,10,000/- రూ. జరిమానా విధింపు

**చిత్తూరు, పెన్ పవర్ అక్టోబర్ 05 :**
జిల్లా ఎస్పీ వి.ఎన్ మణికంఠ చందోలు, ఐపీఎస్ ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డి.ఎస్పీ టి.సాయినాథ్ ఆద్వర్యంలో చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్య బాబు నిన్నటి దినం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 21 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ఈ రోజు ఉదయం ప్రవేశపెట్టగా జడ్జ్ శ్రీమతి ఉమా దేవి వాహనదారులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం 2,10,000/- రూపాటలు ఫైన్ విధించడం జరిగింది. ఈ 10 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన 360 మందికి సుమారు 30.7 లక్షల రూపాయల ఫైన్ విధించడం జరిగింది. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లా లోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, ఇది మీ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుంది. మద్యం సేవించిన వ్యక్తి డ్రైవింగ్ చేయడం పై సెక్షన్ 185 క్రింద మొదటి సారి నేరం చేస్తే రూ. 10,000/- జరిమానా, లేదా 6 నెలల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చు, రెండవ సారి నేరం చేస్తే రూ.15,000/- లేదా 3




సం.ల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చునని కావున వాహనం నడిపే సమయంలో వాహనదారులు రోడ్డు భద్రతా మరియు రహదారి నిభందనలు తప్పక పాటించి ప్రమాదాలు, జరిమానాలు, శిక్షలకు గురి కాకుండా ఉండాలని ఇన్స్పెక్టర్ కోరారు.

# మినీ గోకులం షెడ్లు పై అవగాహన సదస్సు



**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబరు 5**
పుల్లల చెరువు మండల కేంద్రంలోనే మండల పరిషత్ కార్యాలయంలో మినీ గోకులం షెడ్ల పై అవగాహన కార్యక్రమాన్ని ఉపాధి హామీ ఏపీవో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం మినీ గోకులం షెడ్ల మంజూరుకు శ్రీకారం చుట్టిందనీ ఆయన అన్నారు.ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గ్రామాల్లో పశుపోషణ, కోళ్ళు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు.ఇటీవల ఎంపికైన రైతులు పశుపోషకుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.గోకులం పథకం కింద షెడ్లనిర్మాణానికి పశువుల పెంపకందార్లకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు 70 శాతం చొప్పున రాయితీలు కల్పిస్తుందని ఆయన అన్నారు.మండలానికి 25 చొప్పున గోకులం యూనిట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందుల వెంకటయ్య, టీడిపి సీనియర్ నాయకుడు రేంటపల్లి సుబ్బారెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## నూతన ఆర్డీవోను కలిసిన ఎన్ హెచ్ ఆర్ సి నాయకులు



**చిత్తూరు, పెన్ పవర్ అక్టోబర్ 05**
చిత్తూరు జిల్లాకు నూతనంగా వచ్చిన ఆర్డీవో ని చిత్తూరు ఆర్డీవో ఆఫీస్ లో మర్యాద పూర్వకంగా కలిసిన ఎన్ హెచ్ ఆర్ సి నాయకులు. నేషనల్ చీఫ్ సెక్రటరీ బుల్లెట్ రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్ణ చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డేవిడ్, రాష్ట్ర ఉప కార్యదర్శి సురేంద్ర రాష్ట్ర యూత్ ఫోర్ట్ కృష్ణమూర్తి రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు, ఎన్ హెచ్ ఆర్ సి జిల్లా అధ్యక్షులు ధనంజయ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, చిత్తూర్ సిటీ అధ్యక్షులు రమణ, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎడిషన్ జనరల్ సెక్రెటరీ టీడీచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 5**
పుల్లల చెరువు మండల కేంద్రములోనే తహసీల్దార్ కార్యాలయాన్నీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్ అధికారి ఏ కుమార్ శనివారం సాయంత్రం అకస్మిక తనిఖీ నిర్వహించారు.పుల్లల చెరువు మండలంలో గత ప్రభుత్వంలో (ఫ్రీ హోల్డ్) చుక్కలు భూములు,అసైన్ మెంట్ భూములు రిజిస్ట్రేషన్ లో ఏమైనా అవకతలు జరిగాయని ఆరాతీశారు.ఆర్టీఏ, అసైనమెంట్, 22ఎ,1బి,2బి,వెబ్‌ల్యాండ్స్ తదితర 25ఫైల్స్‌కు సంబంధించి తనిఖీ లు చేసినట్లు సమాచారం. ఈ తనిఖీలో తహసీల్దార్ నయూమ్ అహమ్మద్, డిప్యూటీ తహసిల్దార్ కిరణ్, పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డేకి ముఖ్య అతిది గా చిత్తూరు ఎమ్మెల్యే

**చిత్తూరు, పెన్ పవర్ అక్టోబర్ 05 :**
చిత్తూరు నగరంలోని స్థానిక రుక్మిణీకృష్ణ స్వామి విద్యాలయ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ దేకి ముఖ్య అతిది గా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తొ కలసి సీనియర్ నాయకులు చెరుకూరి వసంత్ కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. బద్రీ నారాయణ అధ్యక్షతన విద్యాలయ వ్యవస్థాపకులు కీ. శే. డీకే ఆదికేశవులు, సత్యప్రభ గార్ల చిత్ర పటాలకు నివాళి అర్పించారు.



# జవాబు పత్రాల కోడింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన వైస్ ఛాన్సలర్

## అవాంతరాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన






**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం అక్టోబర్ 5:**
ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన జవాబు పత్రాల కోడింగ్ కేంద్రాన్ని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి శనివారం మధ్యాహ్న సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం బి.ఎడ్. మొదటి సెమిస్టర్ జవాబు పత్రాల కోడింగ్ ప్రక్రియ ప్రారంభమైనది. ఈ సందర్భంగా వి.సి. ప్రొఫెసర్ మూర్తి కోడింగ్ కేంద్ర ఇన్చార్జి గా వ్యవహరిస్తున్న డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తో మాట్లాడారు. కోడింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన మేరకు అందుబాటులో ఉన్న సిబ్బందిని వినియోగించు కోవాలని వి.సి.ప్రొఫెసర్ మూర్తి ఆయనకు సూచించారు. అనంతరం కంట్రోల్ బండిల్ పేపరును విసి ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి నిశితంగా పరిశీలించారు. ఒక్కో కంట్రోల్ బండిల్ నందు 40 మంది విద్యార్థులకు సంభంధించిన మార్కులు పొందు పరిచే విధంగా రూపొందించడం జరిగిందని ఇన్చార్జి డాక్టర్ శ్రీనివాస్ వి.సి.ప్రొఫెసర్ మూర్తికి తెలియ జేశారు. కోడింగ్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని, అదే విధంగా కోడింగ్ పనులు పూర్తి అయిన వెంటనే జవాబు పత్రాల మూల్యాంకనం కూడా ప్రారంభించాలని ఆయన పేర్కొన్నారు.మూల్యాంకనం కోసం అవసరమైన ఏర్పాట్లను కూడా వెంటనే పూర్తి చేసుకోవాలని అన్నారు.బి.ఎడ్ మొదటి సెమిస్టర్ జవాబు పత్రాల కోడింగ్, మూల్యాంకనం వ్యవహారానికి సంబంధించి ఎటువంటి అవాంతరాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వి.సి.ప్రొఫెసర్ మూర్తి, కోడింగ్ కార్యక్రమం నిర్వాహకులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ.సి.టి.ఈ. డాక్టర్ అమృత వల్లి, పరీక్షల విభాగం పర్యవేక్షకులు సూడా.శివ రామయ్యతో బాటు పరీక్షల విభాగం సిబ్బంది,కోడింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా వాటర్ కూలర్ ను బహూకరించిన కొత్తూరు సుధాకర్ బ్రదర్స్



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5**
కందుకూరు మున్సిపల్ కార్యాలయానికి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా పట్టణ తెలుగుదేశం పార్టీ కోశాధికారి కొత్తూరు సుధాకర్ రావు వారి సోదరులు లైఫ్ స్టైల్ చిట్టి ఇద్దరూ కలిసి పదివేల రూపాయలు విలువైన వాటర్ కూలర్ ను మున్సిపల్ కమిషనర్ కే అనూషకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సుధా బ్రదర్స్ ను అభినందించారు. ఇలాగే నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూ ఉండాలని మున్సిపల్ కమిషనర్ అనూష వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ధామల్లేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఉప్పుటూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నూకసానికి కోటపాటి శుభాకాంక్షలు





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నూకసాని బాలాజీ ని విజయవాడ లోని ఆయన కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ముందు ముందు మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని కోటపాటి జనార్దన్ రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బసవయ్య నాయుడు కూడా ఉన్నారు.

## దామచర్ల, నూకసానిలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డు కార్పొరేషన్ చైర్మన్ గా శనివారం బాధ్యతలు స్వీకరించిన దామచర్ల సత్య కి విజయవాడలోని వారి ఛాంబర్ లో శుభాకాంక్షలు ప్రత్యేక అభినందనలు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు లు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా ఈరోజు బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నూకసాని బాలాజీ కి విజయవాడ లోని వారి ఛాంబర్ లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, కందుకూరు పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, వడ్లమూడి సురేష్, మాదాల మల్యాద్రి, గుర్రం మాల్యాద్రి,అల్లం వెంకటేశ్వర్లు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమములలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5**
పట్టణంలోని శ్రీ వెంగమాంబ కళ్యాణ మండపం లో మాదాల మల్లికార్జున, సులోచన కుమార్తె లక్ష్మీ పావని, నవీన్ కుమార్ వివాహ కార్యక్రమానికి హాజరైన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు.కందుకూరు మండలం కోవూరు గ్రామంలో గుంటూరు సుబ్బారావు, రాజమ్మ కుమారుడు రాజేష్, వెంకట సౌమ్య వివాహ కార్యక్రమాన్ని హాజరై నూతన వధూవరులను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు. నాగేశ్వరరావు వెంట వడ్లమూడి సురేష్, గుర్రం మాల్యాద్రి, మాదాల మాల్యాద్రి, నాదెళ్ల రమణయ్య తదితరులు ఉన్నారు.

## శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి వైభవంగా అభిషేకం, పల్లకి సేవ





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5**
కందుకూరు గ్రామదేవత ఆదిపరాశక్తి శ్రీ శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడవ రోజు శుక్రవారం శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు.అమ్మవారిని కన్నుల పండుగగా అలంకరించి, అమ్మవారి అష్టోత్తరం కుంకుమ పూజ నిర్వహించారు. ఉభయ దాతలుగా నవులూరి సుధీర్ ధర్మపత్ని ప్రమీల, కుమారుడు ప్రదీప్, కట్టా వీరాంజనేయులు ధర్మపత్ని విజయలక్ష్మి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. సాయంత్రం వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. అమ్మవారి పల్లకి సేవ ముందు మంగళ వాయిద్యాలు శ్రీ సరస్వతి నిలయం నటరాజనాట్యమండలి వారిచే కోలాటం, పడమటి బలిజ పాలెం వారిచే కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు .ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణవేణి, చక్కా వెంకట కేశవ, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రాడ్యుయేట్ చేత ఓటు నమోదు చేయించాలి సరోజిని

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్**
**బాపట్ల అక్టోబర్ 5**



ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్క కార్యకర్త మీ మీ పరిధిలోని ప్రతి ఒక్కరి చేత నమోదు చేయించండి పల్లం సరోజిని కార్యకర్తలు నాయకులు అందరూ కలిసి ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమాన్ని ఎవరు పరిధిలో వారు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ చేత నమోదు చేయించాలని కూటమి బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలుపు దిశగా కృషి చేయాలని నిరుద్యోగుల కొరకు చేయబోయే మంచి రాబోయే నోటిఫికేషన్ గురించి ప్రతి ఒక్కటి తెలియచేసి ప్రతి ఒక్క కార్యకర్త ఓటు నమోదు కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి , పల్లం సరోజినీ జీవన్ తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ సాప్ చైర్మన్‌ను కలిసిన టి.ఎన్. ఎస్.ఎఫ్.అధ్యక్షులు మురళి

**పలమనేరు అక్టోబరు 05, (పెన్ పవర్):**
ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు ను అమరావతిలోని ఓ సమావేశంలో పలమనేరు నియోజకవర్గ టి.ఎన్. ఎస్.ఎఫ్.అధ్యక్షులు మురళి శనివారం మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయ విశేషాలను అయనతో చర్చించారు.నియోజకవర్గ యువతను క్రీడా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేందుకు అన్ని రకాల చర్యలు ప్రభుత్వం తీసుకొంటుందని,అందుకు నియోజకవర్గ పరిధిలోని యువతకు అవగాహన కల్పించాలని శాప్ చైర్మన్ తనను కోరినట్లు మురళి మీడియాతో తెలిపారు.అనంతరం ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. ఇందులో మురళితో బాటు చంద్రకాంత్, మోహన్,రంజిత్, గణేష్,భార్గవ్,హర్ష తదితరులు పాల్గొన్నారు.



## సత్య, బాలాజీలకు శుభాకాంక్షలు తెలిపిన ఇంటూరి రాజేష్







**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 5**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డు కార్పొరేషన్ చైర్మన్ గా శనివారం బాధ్యతలు స్వీకరించిన దామచర్ల సత్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నూకసాని బాలాజీ కి విజయవాడ లోని వారి ఛాంబర్ లో కలిసిన నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ ఇరువురికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఇరువురు జీవితంలో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

## నేడే డిగ్రీ కళాశాలలో సీనియర్ మీట్ ఫుట్ బాల్ సెలెక్షన్స్



**పలమనేరు అక్టోబరు 05,(పెన్ పవర్):**
చిత్తూరు జిల్లా సీనియర్ మీట్ ఫుట్బాల్ సెలక్షన్స్ జట్టును నేడు పలమనేరు పట్టణంలో ని ఎస్.వి.సి.ఆర్.డిగ్రీ కళాశాలలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ సభ్యులు హేమంత్ రెడ్డి,కిషోర్ కుమార్, పవన్ కళ్యాణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.కావున ఎస్.వి.సి.ఆర్.డిగ్రీ కళాశాలలోఆదివారం ఉదయం 9గంటలకు ఎంపికలు జరుగుతాయన్నారు.మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8712139311 సంప్రదించాలని కోరారు.

## రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారు

**కాణిపాకం, పెన్ పవర్ అక్టోబర్ 05 :**
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం కాణిపాకం శ్రీ స్వామి వారి అనుబంధం దేవాలయమైన శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి ఆలయం నందు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఈరోజు మూడవ రోజు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారు.



# సామాన్యుల సేవకే విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్

## - బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు - ఈనెల 7వ తేదీన బాపట్లలో 54వ బ్రాంచ్ ప్రారంభం

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల అక్టోబర్ 5:**

సామాన్య ప్రజలకు సహకార సేవలు అందించాలని ఉద్దేశంతో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకును స్థాపించినట్లు బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ఈనెల ఏడో తేదీన బాపట్ల పట్టణంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 54 బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా శనివారం బ్యాంకు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు 1916వ సంవత్సరంలో ఫిబ్రవరి 5వ తేదిన 109 సంవత్సరాల క్రితం విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభించారన్నారు. భారతదేశంలో గుజరాత్, మహారాష్ట్ర మినహా సహకార అర్బన్ బ్యాంకులలో అతి పెద్ద సహకార అర్బన్ బ్యాంకుగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 53 బ్రాంచిలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు రూ.4,263.73 కోట్ల డిపాజిట్లు సేకరించి, రూ.3,359.41 కోట్లు ఋణాలు మంజూరు చేసి మొత్తం రూ.7,623.14 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. 1,08,528 మంది సభ్యులతో రూ. 374.23 కోట్ల షేరు ధనం కలిగి ఉన్నట్లు చెప్పారు. ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ సహకార సూత్రాలను త్రికరణ శుద్ధితో, ప్రజాస్వామ్యయుతంగా అమలు చేస్తుందన్నారు. "ఔట్లుక్ ఆన్ అర్బన్ బ్యాంక్స్" పేరుతో రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి దేశంలోని అర్బన్ బ్యాంకులలో మొదటి 15 స్థానాలలో నిలిచి, దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద సహకార అర్బన్ బ్యాంక్ గా గుర్తింపును సాధించినట్లు తెలిపారు. రూ.374.23 కోట్ల షేరు ధనంతో దేశంలోని సహకార బ్యాంకులలో 3వ స్థానంలో, డిపాజిట్లలో 15వ స్థానంలోను, ఋణాలు మంజూరులో 14వ స్థానంలోను, నికర లాభంలో 10వ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. గత 41 సంవత్సరాల నుండి కోవిడ్ సమయంలో ఒకే ఒక ఆర్థిక సంవత్సరం (2019-20) మినహా క్రమం తప్పకుండా 10 నుండి 42 శాతం వరకు డివిడెండ్ సభ్యులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వాణిజ్య బ్యాంకుల నుండి ఎటువంటి తోడ్పాటు పొందలేని ప్రజలకు "విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్" ప్రత్యామ్నాయ బ్యాంకుగా గుర్తింపు



సాధించిందన్నారు. లక్షా ఎనిమిది వేల మందికి పైగా ఉన్నప్పటికీ సభ్యుల భాగస్వామ్యంతో వారి విశ్వాసం, నమ్మకం, సమిష్టి నిర్ణయాలు, ఏకాభిప్రాయంతో నడవడం విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ ప్రత్యేకత అని తెలిపారు. డిపాజిట్లపై అధిక వడ్డీని ప్రజలకు చెల్లిస్తూనే, సామాన్య ప్రజలకు వాణిజ్య బ్యాంకులకన్నా అతి తక్కువ వడ్డీ రేట్లపై రుణాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కాకుండా సభ్యులకు, వారి కుటుంబసభ్యుల సంక్షేమం కోసం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. వైద్య ఖర్చులు తిరిగి చెల్లింపు పథకం, మరణించిన సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, వ్యక్తిగత ప్రమాద బీమా పథకం, సభ్యుల పిల్లలకు విద్యా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. గత 10 సంవత్సరాలలో రూ.35.55 కోట్ల మేరకు సభ్యులకు ప్రయోజనాలు అందించిందన్నారు. సహకారరంగం ద్వారా తన సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నట్లు చెప్పారు. సభ్యుల పిల్లలలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు గత 19 సంవత్సరాలుగా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. పిల్లలకు రూ.2.32 కోట్ల మేర ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరిగిందన్నారు. ఏడాదిలోనే 479 మంది పిల్లలకు రూ.30 లక్షలు అందించామన్నారు. ఏటా ప్రతి బ్రాంచి పరిధిలోనూ వార్షిక జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి ప్రతి బ్రాంచిలోను ఎన్నికైన సభ్యులతో సంప్రదింపుల కమిటీల ద్వారా




కార్యకలాపాల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఆదివారం కూడా బ్యాంకు బ్రాంచిలు ఉదయం పూట పని చేస్తుందని శనివారం సెలవు అని తెలిపారు. రుణం సక్రమంగా చెల్లిస్తే చెల్లించిన వడ్డీ మొత్తంలో 4 శాతం తిరిగి ప్రోత్సాహక రాయితీ కల్పిస్తున్నామన్నారు. అతి తక్కువ సర్వీసు ఛార్జీలతో సభ్యులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. బంగారంపై రుణాలకు ఎటువంటి ప్రాసెసింగ్ ఛార్జీలు, అప్రైజింగ్ ఛార్జీలు ఉండవన్నారు. ఇన్స్టిట్యూషనల్ డిపాజిట్లకు అత్యధికంగా 7.1 శాతం వడ్డీ కల్పిస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్స్ కు 8.1 శాతం వడ్డీతోపాటు 80 ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దనే సేవలు అందిస్తామన్నారు. అదేవిధంగా ఆస్తి తనఖాపై, ఇంటి నిర్మాణం, కొనుగోలు, మరమ్మత్తులకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.50 లక్షల వరకు గోల్డ్ టర్మ్ రుణాలు వ్యాపార వర్గాలకు రుణాలు, చిరు వ్యాపారులకు రోజువారి వసూలు రుణాలు, వ్యక్తిగత రుణాలు, విద్యారుణాలు, సభ్యులకు ప్రత్యేక రుణ పథకాలతో పాటు వాహనాల కొనుగోలుకు రుణాలు అందిస్తామన్నారు. జిఎస్టి పరిధిలోని వ్యాపారులకు వ్యాపార రుణాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జెవి సత్యనారాయణమూర్తి, చిన్నం కోటేశ్వరరావు, ఉపముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి. బి వరలక్ష్మి, జోనల్ మేనేజర్ సిహెచ్ విఆర్ సుబ్రహ్మణ్యం, బ్రాంచ్ మేనేజర్ ఏ అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణాదేవి అలంకరణతో వజ్రాలపురం బోయకొండ గంగమ్మ



**బంగారుపాళ్యం, పెన్ పవర్ అక్టోబర్ 05 :**

చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళ్యం మండలం, వజ్రాలపురం బోయకొండ గంగమ్మ దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నపూర్ణాదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఉదయదారులుగా నాగరత్నమ్మ జనార్దన్ నాయుడు తగ్గువారి పల్లికి చెందినవారు అమ్మవారికి మ్రొక్కుబడులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల వారు మూడవరోజు అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాధమ్మ కృష్ణప్ప, ఆలయ కమిటీ సభ్యులు బుస్సా నాగరాజు గౌడ్, రాజేంద్ర నాయుడు, శివలింగయ్య, రామ్మూర్తి నాయుడు, సుబ్బానాయుడు, వేణుగోపాల్ నాయుడు, శంకరయ్య, తులసి, మురళి, ఆలయ మేనేజర్ మొగిలప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా -వ్యక్తి దుర్మరణం



**పొదిలి, పెన్ పవర్ అక్టోబర్ 5**

ఆటో బోల్తా పడిన సంఘటనలో ఒక వ్యక్తి దుర్మరణం చెందారు ఈ సంఘటన శనివారం నాడు పొదిలి పట్టణానికి సమీపంలోని మాదాలవారిపాలెం గ్రామం వద్ద జరిగింది కొనకనమిట్ల మండలంలోని చౌటుపల్లి గ్రామం నుండి పొదిలికి ఒక ఆటోలో నలుగురు వ్యక్తులు వస్తుండగా, మార్గమధ్యంలోని మాదాల వారి పాలెం గ్రామం సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పి డేనియల్ అనే 60 ఏళ్ల వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు గాయపడిన డేనియల్ ని పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో డేనియల్ మరణించారు ఈ సంఘటనపై పొదిలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వివేమన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# త్రిశక్తుల ఆరాధన ఉపన్యాసం

## పొన్నూరు వేంకట శ్రీనివాసులు



**ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 5**

దేవీ శరన్నవరాత్రులలో త్రిశక్తుల ఆరాధన ్ఞన వైరాగ్యాలను కలిగిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. నగరంలోని కేశవస్వామిపేటలో లలితాశ్రమంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆయన త్రిశక్తుల వైభవంపై ప్రసంగించారు. మహాసరస్వతి వాక్కుని, మహాలక్ష్మి ఐశ్వర్యాన్ని, మహాదుర్గ శక్తిని ప్రసాదిస్తుందన్నారు. ఉపసన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులుని లలితాశ్రమం మాతాజీ ష్ఞినంద సరస్వతి అమ్మవారి శేషవస్త్రంతో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో స్వయంపాకుల కోటేశ్వరశర్మ, అగస్త్యరాజు శివయ్య, నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ, ఒ. ప్రసాద్, గుర్రం కృష్ణ, చిలకపాటి రంగారావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలపై కొరవడిన నిఘా

## ఇష్టా రాజ్యంగా అంగన్వాడి కేంద్రాల నిర్వహణ

## చోద్యం చూస్తున్న అధికారులు

**శ్రీకాళహస్తి - పెన్‌పవర్, అక్టోబర్ 05 :**

శ్రీకాళహస్తి ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడి కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శ్రీకాళహస్తి ఐసిడిఎస్ పరిధిలో తొట్టంబేడు, శ్రీకాళహస్తి టౌన్, శ్రీకాళహస్తి రూరల్ మండలాలు పనిచేస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్టులో పని చేస్తున్న సిబ్బంది గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పాతుకు పోయారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తల బలహీనతలను అదునుగా తీసుకుంటున్న సిబ్బంది అనేక రకాలుగా ముడుపుల రూపంలో తీసుకుంటున్నారు. దీంతో అంగన్వాడి కార్యకర్తలు పని చేసినా , చేయక పోయినా పట్టించుకున్న పాపాన పోవట్లేదు . దీంతో ఈ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంటోంది. ఇక్కడ పనిచేస్తున్న సీడీపీఓ రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసుకుంటూ ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాలనను గాలిలోకి వదిలేసినట్లు ఆ శాఖ సిబ్బంది చెప్పుకోవడం హర్షించ దగ్గ విషయం . అధికారుల ఉదాసీనత కారణంగా ప్రభుత్వం అబాసు పాలఅవుతోంది అనడంలో సందేహం లేదు . ఇప్పటికైనా పాలకులు ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించకుంటే పెను ప్రమాదమే సంభవించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలోని తొట్టంబేడు మండలానికి సంబంధించినటు వంటి అంగన్వాడీ కార్యకర్త రాష్ట్ర అధ్యక్షురాలుగా కొనసాగుతుండడంతో ఈ ప్రాజెక్టు పరిధిలో ఎటువంటి అవినీతి అక్రమాలు జరిగినా... ప్రశ్నించే నాథుడే లేరు . కొంతమంది అంగన్వాడి కార్యకర్తలు కనీసం సెలవు చీటీలు లేకుండా సెలవు పై వెళుతున్నా ...పట్టించుకునే నాథుడే లేరు . ఇంకొంతమంది కనీసం సూపర్వైజర్లకు కూడా సమాచారం ఇవ్వకుండా ఇష్టా రాజ్యంగా సెలవులు పెట్టేస్తున్నారు . ఈ ప్రాజెక్టు పరిధిలో ప్రాజెక్టు స్థాయి అధికారులు అన్నా లెక్కలేనితనంగా అంగన్వాడి కార్యకర్తలు ప్రవర్తించడంపై ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

# సంయుక్త నృత్య కళానిలయం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



**కావలి, పెన్ పవర్ అక్టోబర్ 5**

కావలి పట్టణం తుఫాన్ నగర్ లోని సంయుక్త నిత్య కళా నిలయంలో నాట్య గురువు గంగపట్నం లిఖిత ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలోని ఇందిరా నగర్ లో పక్షవాతం కారణంగా మంచానికే పరిమితమైన ఆటో డ్రైవర్ షేక్.బాదుల్లా ని ఆదుకునేందుకు దాత వినోద్ కుమార్ సహకారంతో బాదుల్లా సతీమణి గౌసియా కి 25 కేజీల బియ్యాన్ని సంయుక్త నృత్య కళా నిలయం నందు అందజేయడం జరిగింది. అలాగే కొన్ని సంవత్సరాల క్రితం ఆటో ప్రమాదంలో గాయపడి తుఫాన్ నగర్లో మంచానికే పరిమితమైన శ్రీను కి భాను కుమార్ సహకారంతో బ్యాక్ రెస్ట్ కిట్ ని వారి ఇంటికే వెళ్లి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాట్యగురువు గంగపట్నం లిఖిత మాట్లాడుతూ తమ యొక్క నృత్య కళా నిలయం ద్వారా పేదలకు సహాయం దాతలు వినోద్ కుమార్, భాను కుమార్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సంయుక్త నృత్య కళా నిలయం ద్వారా ప్రతి నెలా ఒక సేవా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర మరియు నృత్య శిక్షణ నేర్చుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంకట కృష్ణారావుకు ఉత్తమ సేవా పురస్కారం

## జన విజ్ఞాన వేదిక నాయకుల ఘన సత్కారం

**పొదిలి, పెన్ పవర్ అక్టోబర్ 5**

గాండ్ల సంక్షేమం పొదిలి యూనిట్ అధ్యక్షులు చిట్టెం శెట్టి వెంకట కృష్ణారావును శనివారం నాడు పొదిలిలో జన విజ్ఞాన వేదిక నాయకులు ఘనంగా సత్కరించారు వెంకట కృష్ణారావు సమాజాభివృద్ధికి చేస్తున్న సేవలకు గాను ఉత్తమ సేవా పురస్కారం లభించింది ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర జిల్లా నాయకులు కే సుబ్రహ్మణ్యం, దాసరి గురుస్వామి ఘనంగా సత్కరించారు వెంకట కృష్ణారావు గత ఐదేళ్ల నుండి చెకుముకి టాలెంట్ టెస్ట్ లో పాల్గొంటున్న విద్యార్థులకు, ఉచిత భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు మెడల్స్ మెమొంటోళ్లు కూడా సమకూరుస్తున్నారు అంతేగాక గాండ్ల సామాజిక వర్గాన్ని కూడా తన వంతు సహకారం అందిస్తున్నారు ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు సుబ్రహ్మణ్యం, దాసరి గురు స్వామి మాట్లాడుతూ కృష్ణారావు సేవలను అభినందించారు ఈ కార్యక్రమంలో హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్, జె వి వి నాయకులు ప్రసాద్,



జి ఐజక్ బాబు, జి శ్రీనివాసులు చౌదరి, పివి కొండయ్య, బాల నరసయ్య, మూసా జానీ, హరిబాబు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు

# పూతలపట్టు సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి..

**2 వ వర్ధంతి సందర్భంగా పూతలపట్టులో**

**సుబ్బారెడ్డి విగ్రహం ఆవిష్కరణ**

**గౌహతి సుబ్బారెడ్డి**





**పూతలపట్టు, పెన్ పవర్ అక్టోబర్ 05 :**

పూతలపట్టు నియోజకవర్గం. పూతలపట్టు లో భర్తను దైవముగా భావించి ఇంటిలోనే విగ్రహం స్థాపించుకున్న గౌహతి సుబ్బారెడ్డి. పూతలపట్టు మండల కేంద్రంలోని వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. సుబ్బారెడ్డి మరణించి రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా దివంగత సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు ఇంటిలోనే ఆయన విగ్రహం ఏర్పాటు చేసి దైవంతో సమానంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌహతి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తన భర్త మరణించిన నిత్యం మా కళ్ళ ముందర ఉంటాడని విగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు.

# "కేంద్రమంత్రి కీ స్వాగతం పలికిన కోలా ఆనంద్"

### కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ గారినీ గజపూలమాలతో స్వాగతం పలికిన కోలా ఆనంద్

### శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారీ పరిశ్రమలు స్థాపన చేయాలని మంత్రిని కోరిన కోలా ఆనంద్





**శ్రీ కాళహస్తి - పెన్‌పవర్, అక్టోబర్ 05**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ నేతృత్వంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని భాజపా కార్యకర్తలు, నాయకులతో కలసి " కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ కు శనివారం సాయంత్రం ఏపీ సీడ్స్ కూడలి వద్ద ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి నెల్లూరు నుంచి తిరుపతి కి వెళుతూ మార్గ మధ్యలో ఏపీ సీడ్స్ కూడలి నందు సాయంత్రం వస్తున్నారని సమాచారం అందిన వెంటనే కోలా ఆనంద్ తన కార్యకర్తలతో కలసి మంత్రికీ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరా స్వామీ దేవస్థాన తీర్థప్రసాదాలు, శేష వస్త్రంతో సన్మానించారు. భాజపా కార్యకర్తలు గజమాల, పట్టు వస్త్రాలతో మంత్రి ని సత్కరించారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ భూపతి రాజు శ్రీనివాస వర్మ ఆంధ్రప్రదేశ్ నరసాపురం లోకసభ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యుని స్థాయి వరకు అంచెలంచెలుగా పార్టీలో ఎదిగి భాజపా నుంచి ఎన్నికయ్యారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి అసెంబ్లీ అభివృద్ధికీ తోడ్పాటు అందించాలని భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి శ్రీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ నీ కోలా ఆనంద్ కోరారు. తదుపరి మంత్రితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కోలా ఆనంద్ లు కలసి మంత్రి వెంట వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కో - కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, కోలా గోవర్ధన్, రాష్ట్ర సభ్యులు కంద్రిగ ఉమ, రామ్ ఉమ సింగ్, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, ఏపీ సీడ్స్ యూనియన్ నాయకులు పరుకూరు మునెయ్య, నంబాకు ఈశ్వర్ రెడ్డి, జీవి అమర్నాథ్, జ్ఞానగారి పోలయ్య, పుణ్యం డిల్లీ కుమార్, రామకృష్ణా రెడ్డి, తానికొండ్లా భరత్ కుమార్ నాయుడు, సజ్జ హరీష్, ఆర్. హరీష్ రెడ్డి, హుకుం సింగ్, సూర బిందు కుమార్, సిద్దు, నాని, గిరిధర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా విజేతలకు బహుమతి ప్రధానోత్సవం



**చీరాల, అక్టోబర్ 05,పెన్ పవర్**

చీరాలకు చెందిన గీతా యంగ్ సైంటిస్ట్, జాతీయ సైన్స ప్రాజెక్ట్ ప్రదర్శనల విజేతలకు, బహుమతి ప్రధానోత్సవం, విజ యవాడ దగ్గర ఆర్కే కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ లో కనుల పండువగా జరిగింది. ఆర్. కె. ఇంజనీరింగ్ కాలేజ్ యాజమా న్య ప్రతినిధి, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య తనయుడు, తెలుగుదేశం పార్టీ యువ నేత మద్దులూరి గౌరీ అమర్నాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని, విజేతలకు బహుమ తులను అందజేసి, వారిని అభినందించారు. తొలుత గీతా సంస్థ ప్రతినిధులు అమ ర్నాథ్ కు ఘన సన్మానం చేశా రు. కార్యక్రమంలో చీరాల గీతా సంస్థ చైర్మన్ వలివేటి మురళీ కృష్ణ, బాబా అటమిక్ రీసెర్చ్ సెంటర్(ముంబై)శాస్త్ర వేత్త ఎస్.సాయికృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ య్య, ఐ. సాయిరామ్, పేరకం శ్రీమన్నారాయణ, బాపట్ల జి ల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భాను చంద్ర మూర్తి, కిరణ్, వె న్నెల, వలివేటి భరత్ తదితరు లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బూచేపల్లిని కలిసిన అభిమానులు

**శీలం రామ సత్యనారాయణ రెడ్డి .**

**అల్లపురెడ్డి రఘునాథరెడ్డి .**



**పెన్ పవర్, కంభం అక్టోబర్ 5:**

జిల్లా పార్టీ వైసిపి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని కంభం పట్టణానికి చెందిన శీలం రామ సత్యనారాయణ రెడ్డి అల్లపురెడ్డి రఘునాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ వైసీపీ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కార్యకర్తలు ఎలాంటి సమస్యలు ఉన్నా తమను నేరుగా సంప్రదించవచ్చని సూచించడం జరిగింది. పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటామని ప్రతి కార్యకర్తకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు .వైసిపి పార్టీ అభిమానులను ఎంతటి వారైనా స్వాగతించడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలపడం జరిగిందని వారు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో వారిలో పాపా తిరుపతిరెడ్డి శివరామకృష్ణ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

## నుకసాని బాలాజీకి శుభాకాంక్షలు తెలియజేసిన ఎంపీ కృష్ణప్రసాద్





**పెన్ పవరప స్టాప్ రిపోర్టర్**
**బాపట్ల అక్టోబర్ 5:**



ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నుకసాని బాలాజీ ని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం విజయవాడ కార్యాలయంలో బాలాజీ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణప్రసాద్ ఆయనను అభినందించారు. బాలాజీ పార్టీకి చేసిన కృషిని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తగు గుర్తింపునిస్తూ మంచి పదవీ ఇచ్చారని, సమర్థవంతంగా ఆ బాధ్యతలు నిర్వర్తిస్తు పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పని చేయాలని ఈ సందర్భంగా ఎంపీ ఆకాంక్షించారు. తదనంతరం విజయవాడలో ఉన్న లిడ్ క్యాప్ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీ కృష్ణప్రసాద్ అక్కడ తయారవుతున్న ఉత్పత్తులను పరిశీలించారు. గతంలో ఎంపీ లిడ్ క్యాప్ అధికారిగా ఉన్నప్పుడు అమలు చేసిన సంస్కరణలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

## రోడ్డు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు**



**పొదిలి, పెన్ పవర్ అక్టోబర్ 5**

వాహనదారులు రోడ్డు నిబంధనలను అతిక్రమిస్తే, అటువంటి వారిపై చర్యలు తప్పవని పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు శనివారం సాయంత్రం స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్లో ఆయన వాహనాల తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా పెద్ద బస్టాండ్ సెంటర్లోని వన్ వే ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వాహనదారులకు జరిమానాలు విధించారు రోడ్డు నిబంధనలను మరోసారి అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను సక్రమంగా పాటిస్తూ, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు వాహనాలు నడిపేటప్పుడు తమతో పాటు తమ కుటుంబాలు కూడా తమపై ఆధారపడి ఉంటాయని విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు వాహనాల తనిఖీల కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు తోపాటు పోలీస్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# జర్నలిజంతో సమాజంలో మార్పు

# ఘనంగా డీజేఎఫ్ సదస్సు

**ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 5**

జర్నలిజంతోనే సమాజం లో మార్పు వస్తుందని, ప్రజల హక్కులకు భరోసా ఇచ్చేదే జర్నలిజం అని ప్రముఖ పాత్రికేయుడు ఖాన్ యాజ్దానీ అన్నారు ప్రకాశం జిల్లా ఏపీ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో 77 ఏళ్ల ప్రజాస్వామ్య ఫలవంతంలో జర్నలిజం పాత్ర అనే అంశంపై నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శనివారం సదస్సు నిర్వహించారు ఒంగోలు డివిజన్ అధ్యక్షుడు గద్దల శివాజీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఒంగోలు నగర కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత, శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఎండి డాక్టర్ చాపల వంశీకృష్ణ పాల్గొని ప్రసంగించారు. సభలో సీనియర్ జర్నలిస్టు కసుకుర్తి మాల్యాద్రికి సంతాప సూచకంగా మౌనం పాటించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఖాన్ యాజ్దానీ ముఖ్యవక్తగా పాల్గొని రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో జర్నలిస్టులు ముఖ్యపాత్ర వహించాలని సూచించారు. అధికార పదవుల్లో ఉన్నవాళ్లు ఆధిపత్య మతాలకు సరికాదని అన్నారు. సభా కార్యక్రమానికి తొలుత డిజెఎఫ్ జిల్లా ప్రతినిధి లంకా రాజు స్వాగతం పలుకగా వ్యవస్థాపక కన్వీనర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ డీజేఎఫ్ చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్లు హిందూ ఫోటోగ్రాఫర్ కొమ్ము శ్రీనివాస్, సాక్షి ఫోటోగ్రాఫర్




ప్రసాద్, షణ్ముఖ వెలుగు ఫోటోగ్రాఫర్ ఉబ్బా అశోక్, ఉదయ అక్షరం ఫోటోగ్రాఫర్ శ్రీనివాసరావు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో డీజేఎఫ్ నగర అధ్యక్షులు జీ. శివాజీ, ఉపాధ్యక్షులు ఉబ్బా అశోక్, కోశాధికారి పి. సురేంద్ర, వ్యవస్థాపక అధ్యక్షులు బి. శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పి. సతీష్ , భక్తవత్సలం, నూకతోటి శరత్, పలువురు జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎర్రన్న కుటుంబంతో అనుబంధం మరువలేనిది

**పాత జ్ఞాపకాలను నెమరేసుకున్న విజయ్ కుమార్**



**శ్రీ కాళహస్తి - పెన్‌పవర్, అక్టోబర్ 05.**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రివర్యులు స్వర్గీయ కింజారపు ఎర్రం నాయుడుతోపాటు వారి కుటుంబంతో ఉన్న సన్నిహిత సంబంధాలను గుర్తుకు తెచ్చుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వగృహం ఊరందూరుకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు ఆయనను కలిశారు. ఈ నేపథ్యంలో ఇరువురు మధ్య సంభాషణ ఆసక్తికరంగా సాగింది. పాత జ్ఞాపకాలను ఇరువురు గుర్తుకు తెచ్చుకుంటూ చర్చించుకున్నారు. తన తండ్రి ఎర్రం నాయుడుతోపాటు తమ కుటుంబంతో విజయ్ కుమార్ కు ఉన్న సన్నిహిత సంబంధాన్ని గుర్తు చేసుకుంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సాగించిన సంభాషణ ఆశ్చర్యానికి గురిచేసింది. కేంద్రమంత్రి హోదాలో ఉన్నప్పటికీ పాత జ్ఞాపకాలను మరచిపోకుండా గుర్తించుకొని మరి పలకరించి సంభాషించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. విజయ్ కుమార్ నాయుడు కూడా ఆయనతో కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ముచ్చటించారు. వీరిద్దరి ముచ్చట్లు తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి పాత రోజులను మరిచిపోకుండా గుర్తించుకుని తనను ఆత్మీయంగా పలకరించి సంభాషించడం పట్ల విజయకుమార్ నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఇది ఎర్రన్న కుటుంబానికున్న నైజంగా పేర్కొన్నారు.

## వేప అంకమ్మ తల్లి ఆలయంలో

# దసరా నవరాత్రి వేడుకలు



**ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 5**

దసరా పండుగను పురస్కరించుకొని నగరంలోని దేవాలయాలన్ని ఆధ్యాత్మిక శోభతో అలరిస్తున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి అమ్మవారి అనుగ్రహాన్ని పొందుతున్నారు. ఆలయాలన్నీ విద్యుత్ దీపాలంకరణలో శోభాయమానంగా ఆధ్యాత్మిక దీప్తిని దిగుణకృతం చేస్తున్నాయి. స్థానిక సీతారాంపురంలోని వేప అంకమ్మ తల్లి దేవస్థానంలో దసరా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆ కార్యక్రమాల్లో భాగంగా శనివారం వేప అంకమ్మ తల్లి అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పసుపులేటి సరస్వతి, కుమారుడు హనుమంతురావు మాట్లాడుతూ వేప అంకమ్మ తల్లి ఆశీస్సులతో సీతారాంపురంలో ఆలయాన్ని నిర్మించి పండుగలు అన్నిటిని ఘనంగా నిర్వహిస్తూ ఉన్నామని, ఆలయ నిర్మాణంతో పరిసరాలలో ఆధ్యాత్మిక భావనలను పెంచి పరిసర హిందూ సమాజంలో దైవిక శక్తులను ఉద్దీపన చెందడం జరుగుతుందని తెలిపారు. ఆలయ పురోహితులు చిల్లర పవన్ కుమార్ శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు ఆదివారం లలితా త్రిపుర సుందరిగా భక్తులను అనుగ్రహిస్తారని, కావున ఒంగోలు నగర పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామి అమ్మవారిని దర్శించి అనుగ్రహం పొందాలని కోరారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## రెస్టారెంట్లపై పోలీసుల దాడులు

**మద్యం తాగినట్లు తెలిస్తే కఠిన చర్యలు**

**సీఐ మల్లికార్జున ఎస్ఐ నరసింహారావు.**





**పెన్ పవర్, కంభం అక్టోబర్ 5:**

కంభం పట్టణంలో పలు రెస్టారెంట్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. సిఐ మల్లికార్జున ఆధ్వర్యంలో ఎస్సై నరసింహారావు పోలీస్ సిబ్బంది పలు రెస్టారెంట్లను తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్లలో మద్యం సేవించడం చేయరాదని వారికి సూచించారు. ఎవరైనా మద్యం సేవించినట్లు పట్టుపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనుకడమని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పలు రెస్టారెంట్లు యజమానులు జాగ్రత్తలు తీసుకున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పవని భానుచంద్రమూర్తి తపన ప్రశం సనీయం

### టిడిపి యువనేత మద్దులూరి గౌరీ అమర్నాథ్




**చీరాల, అక్టోబర్ 05, పెన్ పవర్**

పర్యావరణ పరిరక్షణ కు, ఉపాధ్యాయులు పవని భాను చంద్ర మూర్తి తపన ప్రశంసనీయమని, ఆయన కృషి స్ఫూర్తిదాయకమని, ఆర్కే ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్య ప్రతినిధి, టిడిపి యువ నేత మద్దులూరి గౌరీ అమర్నాథ్ అన్నారు. పర్యావర ణ పరిరక్షణకై, ప్లాస్టిక్ ను నిషే ధించి, గుడ్డ సంచులే వాడాల ని, సొంత ఖర్చుతో భాను మా స్టార్ తయారుచేయించిన క్లాత్ బ్యాగ్స్ ను, జాతీయ స్థాయి ప్రముఖులు, ప్రతినిధులతో కలిసి, అమర్నాథ్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా పలువు రు వక్తలు మాట్లాడుతూ, ఉపాధ్యాయునిగా పర్యావరణ పరిరక్షణకై పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యార్థులను చైతన్య పరచడమే కాకుండా, సొంత ఖర్చుతో క్లాత్ బ్యాగ్స్ ను పంపిణీ చేయడం, ప్రశంస నీయఅంశమే కాకుండా, పర్యా వరణ పరిరక్షణ కోరే ప్రతి ఒక్క రికి స్ఫూర్తిదాయకమని, భాను మాస్టర్ ను అభినందించారు. కార్యక్రమంలో ముంబై బాబా అటమిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్ర వేత్త ఎస్.సాయి కృష్ణ, కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, గీతా సంస్థ చైర్మన్ వలివేటి మురళీకృష్ణ, జాతీయస్థాయి ప్రముఖులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ కాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందిస్తా

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు





**శ్రీ కాళహస్తి. పెన్‌పవర్, అక్టోబర్ 05**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఇంటికి విచ్చేశారు. వీరికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబీకులు సాదర ఆహ్వానం పలికి అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కేంద్రమంత్రిగా తాను ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొట్ట మొదటిసారిగా శ్రీకాళహస్తికి విచ్చేసానని నేడు దివంగత నేత మాజీ మంత్రివర్యులు గోపాల కృష్ణారెడ్డి మరియు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఇంటికి విచ్చేయడం ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో రేణిగుంట విమానాశ్రయాన్ని జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తానని తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేస్తున్న పనులను తాను గమనిస్తున్నానని కేంద్రం నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గానికి కావలసిన నిధులను సమకూర్చే విధంగా తాను కృషి చేస్తానని, శ్రీకాళహస్తి నియోజకవర్గన్ని అభివృద్ధి అభివృద్ధి అయ్యేవిధంగా పలు పథకాలను తీసుకుని వచ్చి తను వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలియజేశారు.

# చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా -దామచర్ల సత్య











**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం అక్టోబర్ 5**

రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా కష్టపడి పని చేస్తానని రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు యువత ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తారని రాష్ట్ర మారిటైమ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మంగళగిరిలోని మారి టైం కార్యాలయంలో కుటుంబ సభ్యులు రాష్ట్ర మంత్రులు సహచర కార్పొరేషన్ చైర్మన్లు పార్టీ కార్యకర్తలను శనివారం దామచర్ల సత్య మారి టైం కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం సువిశాలమైన సముద్ర తీరాన్ని కలిగి ఉందన్నారు. ఓడరేవులు అభివృద్ధి చెందడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. రాష్ట్రంలో చిన్న ఓడరేవులు అభివృద్ధి చేయడం ద్వారా ఎంతో మంది మత్స్యకార కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 14 ఫిషింగ్ హార్బర్లు, మూడు పోర్టులు తోపాటు రాబోయే ఐదేళ్లలో 22 వేల కోట్లు పోర్టుల అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర ద్వారా ఏదైతే యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు దానికి అనుగుణంగా మారి టైం బోర్డు తరపున కృషి చేస్తామన్నారు. తనకు మరి టైం బోర్డు చైర్మన్ గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. మరి టైం బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరణ సందర్భంగా రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, కొండపల్లి శ్రీనివాస్, తోపాటు ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఏలూరి సాంబశివరావు, మద్దులూరి మాలకొండయ్య, ఉగ్ర నరసింహారెడ్డి, గొట్టిపాటి లక్ష్మి, ధూళిపాల నరేంద్ర కుమార్, పత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, భాష్యం ప్రవీణ్, రఘురాం కృష్ణంరాజు, చింతమనేని ప్రభాకర్, నక్క ఆనంద్ బాబు, యార్లగడ్డ వెంకట్రావు, తోపాటు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు రాష్ట్రస్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.












On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# సుప్రీంకోర్టు మీదా నమ్మకం, గౌరవం లేని వ్యక్తి జగన్ రెడ్డి: ప్రత్తిపాటి

## సాతులూరులో అభివృద్ధి పనులకు ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన, ప్రారంభోత్సవం







**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 05:**

దేవుడి మీదే కాదు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై కూడా నమ్మకం, గౌరవం లేని రీతిలో జగన్ ప్రవర్తిస్తున్న తీరు విచిత్రం ఉందని తప్పుబట్టారు మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. తిరుమల లడ్డూ వివాదంలో సుప్రీం కోర్టు స్వతం త్ర దర్యాప్తునకు ఆదేశించి... ఏర్పాటు చేస్తామన్న ప్రత్యేక సిట్‌పైనా జగన్ రెడ్డి, అతడి బ్లూ మీడి యా, సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాలే అందుకు కారణం అన్నారు. సిట్టూ లేదు బిట్టూ లేదంటున్న జగన్ అతడి గ్యాంగ్ విపరీత ధోరణలు చూస్తే లడ్డూ వివాదంపై దర్యాప్తు కూడా తమకే అప్పగిస్తే తప్ప వాళ్లెవ రూ శాంతించేలా లేరంటూ ఎద్దేవా చేశారు. నాదెండ్ల మండలం సాతులూరులో శనివారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు రూ.కోటి విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, శివాలయం బజార్, మెయిన్ రోడ్, ఓసీ కాలనీలో సీసీ రహదారులు, మురుగుకాల్వలు, కల్వర్టల నిర్మాణ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని వారిద్దరూ అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన తిరుమల లడ్డూకి వాడే నెయ్యిలో చేసిన అవినీతి అడ్డంగా దొరికిన దొంగలు జగన్ ము ఠా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంలో ఇప్పటికే జగన్ అన్ని హద్దులు దాటేశారని, చివరకు భారతదేశాన్నే ప్రశ్నించే దుస్సాహసం చేశారన్నారు. రాష్ట్రం, దేశం, న్యాయవ్యవస్థ ఇలా వేటిపైనా నమ్మకం లేని వ్యక్తి అసలు ఇక్కడ ఎందుకు ఉంటున్నారో అర్థం కావడం లేదన్నా రు. తిరుమలకు వెళ్తానని చెప్పి డిక్లరేషన్‌పై సంతకం చేయాలని ఆగిపోయిన వ్యక్తి ఇంకా ఏ మొహం పెట్టుకుని తిరుమల వివాదంలో తనను తాను సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తహీల్దార్, ఎంపిడిఓ,సచివాలయం సిబ్బంది ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండారు పల్లి సత్యనారాయణ, సాతులురు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డి ఈ అబ్దుల్ రహీంకు శుభాకాంక్షలు తెలిపిన పలువురు పుర ప్రముఖులు...





**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 5**

మున్సిపల్ డి ఈ గా షేక్ అబ్దుల్ రహీం శనివారం నాడు బాధ్యతలు స్వీకరించారు.. ఈయన మంగళగిరి కార్పొరేషన్ నుండి చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపి నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, టీడీపి అధికార ప్రతినిధి మురకొండా మల్లిబాబూ,

షేక్ అజారుద్దీన్,షేక్ జానీ భాష, కొత్త కోటేశ్వరరావు, మటన్ సుభాని, పలువురు పుర ప్రముఖులు, మున్సిపల్ తోటి ఉద్యోగులు, మున్సిపల్ కాంట్రాక్టర్లు, మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలకలూరిపేట పట్టణం పై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి అబ్దుల్ రహీం అని అతనిని విధులు నిర్వర్తించిన కాలంలోనే ఎపి టిట్కో గృహాల నిర్మాణం, అమృత్ పథకం నిర్మాణం, మంచి నీటి సరఫరా సమస్యలను లేకుండా ఫిల్టర్ హౌస్ ల నిర్మాణం చేపట్టడం జరిగిందని విధులలో సమర్థవంతంగా నిర్వహించే మున్సిపాలిటీ పట్ల పూర్తి అవగాహన అవగాహన కలిగిన అబ్దుల్ రహీం బాధ్యతలు చేపట్టడం శు భ పరిణామమని పుర ప్రముఖులు వ్యాపారవేత్తలు కొనియాడారు వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## అబద్ధానికి ప్యాంటు, చొక్కా వేస్తే మాజీ సీఎం జగన్ రెడ్డి: ప్రత్తిపాటి

### కార్పొరేషన్ ఛైర్మన్లుగా బాధ్యతలు చేపట్టిన దామచర్ల సత్య, లంకా దినకర్ కు ప్రత్తిపాటి అభినందనలు





**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 05:**

అబద్ధానికి ప్యాంటు, చొక్కా వేస్తే మాజీ సీఎం జగన్ రెడ్డి అని ధ్వజమెత్తారు మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. అయిదేళ్ల అరాచకాలు మరిచి జగన్ చేస్తున్న గోబెల్స్ ప్రచారాలే అందుకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ఇకనైనా మళ్లీ అధికారంలోకి వస్తామంటూ పగటికలలు మాని, కళ్లు తెరిచి రాష్ట్రంలో జరిగే సంక్షేమాన్ని చూడా లని చురకలు వేశారు. శనివారం మంగళగిరిలోని రాయల్ కన్వెన్షన్ సెంటర్ లో మారిటైమ్ బోర్డు ఛైర్మన్ గా దామచర్ల సత్యనారాయణ(సత్య) పదవీ ప్రమాణస్వీకారం సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఎమ్మెల్యే ప్రత్తిపాటి. అలానే 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన లంకా దినకర్ ను కలిసి అభినందనలు తెలిపారు. తాడేపల్లిలోని పాతూరి అతిథిగృహంలో ఆయన్ను సత్కరించారు. అనంతరం మీడియాలో మా ట్లాడిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి కూటమి వంద రోజుల పాలనపై మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిద్రలేచినప్పుడల్లా నోటికొచ్చింది మాట్లాడడం, ఆ చెత్తంతా సొంత సాక్షి పత్రికలో అచ్చేసుకోవడం తప్ప ఈ మూడున్నర నెలల్లో జగన్ చేసిందేంటని ప్రశ్నించారు ప్రత్తిపాటి.

# చిత్తూరు రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, చిత్తూరు ఎం ఎల్ ఏ

### ఈ నెల 7 తేదీ నుండి పూర్తిస్థాయిలో చిత్తూరు రూరల్ తహసిల్దార్ కార్యాలయం అందుబాటు లో ఉంటుంది జిల్లా కలెక్టర్

### రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో చిత్తూరు రూరల్ తహసిల్దార్ కార్యాలయం –చిత్తూరు శాసన సభ్యులు



**చిత్తూరు, పెన్ పవర్ అక్టోబర్ 05**

పాత చిత్తూరు ఆర్ డి ఓ కార్యాలయానికి మరమ్మత్తులు చేసి చిత్తూరు రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం చిత్తూరు పాత ఆర్ డి ఓ కార్యాలయం లో మరమ్మత్తులు చేసిన చిత్తూరు రూరల్ తహశీల్దార్ రూరల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్, చిత్తూరు ఎం ఎల్ ఏ గురజాల జగన్మోహన్,జే సి జి.విద్యాధరి తో కలసి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..**

జిల్లాలో చిత్తూరు రూరల్ మండలానికి తహశీల్దార్‌ను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బంది కేటాయింపు జరిగిందని మరికొన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి అనంతరం సోమవారం నుండి పూర్తిగా ప్రజలకు అందుబాటు లోకి వస్తుందన్నారు. కార్యాలయం ఏర్పాటుకు చిత్తూరు ఎం ఎల్ ఏ సహకారం అందించారన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. చిత్తూరు ఎం ఎల్ ఏ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉండేలా చిత్తూరు రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి కేటాయించాలని జిల్లా కలెక్టర్ ను కోరగా వెంటనే అనుమతించారన్నారు. చిత్తూరు పట్టణ అభివృద్ధి ని ఆకాంక్షించి ఆర్థిక సహాయం అందించదలచిన వారి కోసం చిత్తూరు డెవలప్మెంట్ ఇన్ఫ్రా ఫండ్ పేరుతో బ్యాంక్ అకౌంట్ ప్రారంభించడం జరిగిందని, ఈ నిధులతో చారిత్రాత్మక విశేషం కలిగిన పాత తాలూకా పోలీసు స్టేషన్, పాత జెడ్పి భవనాలు, పి సి ఆర్, కణ్ణన్ కళాశాలలను బాగు చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, పారిశ్రామిక వేత్తలు గమనించి ముందుకు రావాలన్నారు. చిత్తూరు లోని చారిత్రాత్మక కట్టడాల ను కాపాడుకోవడానికి, చిత్తూరు పట్టణ వైశిష్ట్యాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ప్రజలు తమ సూచనలను తెలియజేయ వచ్చునని అన్నారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ బి.పుల్లయ్య, చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు, మాజీ ఎం ఎల్ సి, మేయర్ దొరబాబు, కఠారి హేమలత, చిత్తూరు రూరల్ తహసిల్దార్ లోకేశ్వరి సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## కాణిపాక బ్రహ్మోత్సవాలకు సేవలందించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను సత్కరించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్




**కాణిపాకం, పెన్ పవర్ అక్టోబర్ 05 :**

కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సహకారం మరువలేదని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ కొనియాడారు. శనివారం కాణిపాకం ఆస్థాన మండపంలో నిర్వహించిన కాణిపాకం బ్రహ్మోత్సవాల కృతజ్ఞత సమావేశానికి పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మెమొంటోలతో సత్కరించారు. అనంతరం దేవస్థానం సిబ్బందికి, అర్చకులకి, వేద పండితులకు, లడ్డూ పోటు కార్మికులకు, కాంట్రాక్టు సిబ్బందికి సత్కరించారు. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ ప్రసంగిస్తూ... కాణిపాకం మాస్టర్ ప్లాన్ ను ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళామని అయితే దీనిపై సీఎం గారు సానుకూలంగా స్పందించారని, 2025 బ్రహ్మోత్సవాలకు కాణిపాకంను తిరుమల తరహాలో ఉభయదారులతో, ఉద్యోగులు, స్థానికుల సహకారంతో మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలియజేశారు. కాణిపాకం బ్రహ్మోత్సవాలు ఎటువంటి లోటు లేకుండా అందరి సహకారంతో దిగ్విజయంగా ముసిందని, ఇక నుండి యాభై వేల మంది భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించే విధంగా అభివృద్ధి చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో గురుప్రసాద్, మాజీ ఆలయ ఛైర్మన్ మణినాయుడు, మాజీ ఈవో కేశవులు, ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన మున్సిపల్ డీ ఈ గా అబ్దుల్ రహీం బాధ్యతలు స్వీకరణ..

**చిలకలూరిపేట అక్టోబర్ 05:**

స్థానిక పురపాలక సంఘం నూతన డీఈ గా శనివారం నాడు షేక్ అబ్దుల్ రహీం బాధ్యతలు చేపట్టారు, డి ఈ గా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ రహీం 2014 నుండి 2019 వరకు చిలకలూరిపేట లోనే ఏ ఈ గా విధులు నిర్వర్తించారు, అనంతరం మున్సిపల్ డి ఈ గా 2020 నుండి 2022 వరకు విధులు నిర్వర్తించి మంగళగిరి కార్పొరేషన్ కు బదిలీ అయ్యారు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో తిరిగి చిలకలూరిపేట డి ఈ గా బదిలీపై వచ్చి నేడు బాధ్యతలు స్వీకరించారు వీరికి మున్సిపల్ కాంట్రాక్టర్లు ప్రముఖులు అందరు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ప్రజలందరిలో గుండెం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెరగాలి

## పురుషోత్తపట్నంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రత్తిపాటి







**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 05:**

ప్రజలందరిలో గుండె ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు మాజీ మంత్రి, చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. ఇవాళ దేశంలో సైలెం ట్ కిల్లర్‌గా గుండెవ్యాధులు ప్రజల ప్రాణాలు తీసేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఏటా నమోదవుతున్న మరణాల్లో 32శాతం వరకు హృదయసంబంధ సమస్యలతోనే ఉండడం ప్రతి ఒక్కరు గమనించాల్సిన అవసరం అన్నారు. చిలకలూరిపేట పురుషోత్తపట్నంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఫ్రీ మెడికల్ కేర్, ప్రసిద్ధ మైసూర్ డాక్టర్ హారున్ రషీద్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధుల తనిఖీ నిమిత్తం ఈ శిబిరం ఏర్పాటు చేశారు. శనివారం, ఆదివారం వరకు రెండ్రోజులు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి కులమతాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుండె సంబంధిత మరణాల్లో చాలవరకు ముందే మేల్కొంటే నివారించవచ్చన్నారు. అందుకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గుండెవ్యాధులతో బాధపడుతున్న వారిని ముందే గుర్తించి అవసరమైన వైద్యం అందించడం ద్వారా ముప్పు నుంచి బయటపడ వచ్చని నిపుణులు కూడా పదేపదే చెబుతున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే శస్త్రచికిత్సలు అవసరం లేకుండా ఔషధాలతోనే గుండె సంబంధిత వ్యాధులు నివారించేందుకు పురుషోత్తపట్నంలో ఉచితశిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


# జనసేన విస్తరణ దిశగా పవన్





**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:** రాజకీయాలు ఎంత విచిత్రంగా ఉంటాయంటే ఏదో సినిమాలో చెప్పినట్టు " లైట్ ఎక్కడో ఉంటుంది.. దాని స్విచ్చు ఇంకెక్కడో ఉంటుంది". నాయకుల స్పీచ్ గమనిస్తే యథాలాపంగా మాట్లాడిన మాటల వెనుక చాలా పెద్ద వ్యూహమే కనపడుతుంది. దానికి పవన్ కల్యాణ్ వారాహి డిక్లరేషన్ ప్రసంగం బెస్ట్ ఎగ్జాంపుల్. ఎక్కడో ఆవు నెయ్యి కల్తీ దగ్గర మొదలైన రచ్చ పవన్ సనాతన ధర్మం కోసం తమిళంలో నిప్పులు చెరిగిన వరకు చేరుకుంది. సనాతన ధర్మ బోర్డ్ అనీ ధర్మ పరిరక్షణ అనీ పవన్ చాలా అంశాల మీదే మాట్లాడినా అసలు టార్గెట్ మాత్రం తమిళ రాజకీయ చిత్రమే అని అర్థమయిపోతుంది అంటున్నారు విశ్లేషకులు. పవన్ కల్యాణ్ ఎంత తెలివైనవాడు అంటే అత్యంత సన్నిహితంగా మెలుగుతున్న వారు కూడా ఆయన వ్యూహం ఏంటి అనేది సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. ఆయన ఆవేశమంతా ఏదో జగన్ మీదనో.. తిరుమలలోని ఆ కల్తి నెయ్యి వివాదం మీదనో అని భావించారు. కానీ ఆయన తన పార్టీని విస్తృతపరిచే దిశగా అడుగులు వేస్తున్న సంగతి స్పష్టమైపోయింది. ఫక్తు ద్రవిడ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే తమిళనాడులో ఆల్టర్నేటివ్ పొలిటికల్ థాట్‌ను బిల్డ్ చేసే పనిలో పవన్ ఉన్నట్టు తెలిసిపోతుంది. తమిళనాడులో ఎంట్రీ ఇవ్వడం కోసం జాతీయ పార్టీలు చాలా ప్రయత్నించాయి. కానీ ఎంజీఆర్,కరుణానిధి కాలం నుంచి కూడా అది వర్కౌట్ కాలేదు. వారిద్దరనే కాదు తర్వాత కాలంలో జయలలిత, కరుణానిధి మధ్య ఎంతటి పొలిటికల్ వైరం నడిచినా బయట వ్యక్తులని వారు ఎంటర్ కానివ్వలేదు. మధ్యలో శరత్ కుమార్, విజయ కాంతుల లాంటి వాళ్ళు పార్టీలు పెట్టినా స్థానిక అంశాల మీదనే ఫోకస్ చేశారు. అంతే కానీ యాంటీ ద్రవిడియన్ థాట్ ఏ మాత్రం తమిళనాట ఎంకరేజ్ చేయలేదు. పోనీ వాళ్లందరి హవా ముగిసిపోయిన తర్వాత అంటే కరుణానిధి, జయలలిత మరణంతో తమిళ రాజకీయాల్లో ఒక ఖాళీ ఏర్పడింది. దీన్ని అవకాశంగా తీసుకుందామనే జాతీయ పార్టీలకు స్టాలిన్ అడ్డుగా నిలబడ్డారు. శశికళ, అన్నామలైల ద్వారా తమిళనాట ప్రయోగం చేద్దామనుకున్న బీజేపీ బోల్తా పడింది. లేటెస్ట్‌గా తమిళ దళపతి విజయ్ సినిమాలకు బ్రేక్ ఇచ్చి రాజకీయాల్లోకి వచ్చారు. మరో రెండేళ్లలో జరిగే తమిళనాడు ఎన్నికల్లో ప్రధాన పోటీ డీఎంకే, విజయ్ పార్టీ ౹౹ఎఐ మధ్యే ఉండే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి. విజయ్ కూడా తన సినిమాల ద్వారానో, అభిప్రాయాల ద్వారానో పూర్తిగా ద్రవిడ భావజాలాన్ని ప్రకటిస్తూ వచ్చారు. "మెర్సల్" సినిమాలో ఊూ పై తను పేల్చిన డైలాగ్స్ దేశవ్యాప్తంగా పెద్ద చర్చనే రేపాయి. ఆ టైంలో ఢిల్లీ పెద్దల ఆగ్రహానికి గురైన ఘటనలు కథనాలుగా చూసాం. మరోవైపు స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ తమిళనాడు ఉప ముఖ్యమంత్రి హోదాలో ప్రస్తుతం ఉన్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ ఆయన ఇచ్చిన స్టేట్మెంట్ ఏ రేంజ్‌లో ప్రకంపనలు సృష్టించాయో తెలిసిందే. సో భవిష్యత్తులో తమిళనాడులో పార్టీలు తమలో తాము ఎంతగా కొట్లాడుకున్నా మత ఆధారిత రాజకీయాలవైపు మొగ్గు చూపే ఛాన్స్ లేదు. దీనినే ఒక అవకాశంగా పవన్, ఆయన సన్నిహితులైన ఢిల్లీ పెద్దలు భావిస్తున్నారని సమాచారం.అసలు తమిళనాడు అనేది పొలిటికల్‌గా జాతీయ పార్టీలకు చాలా అవసరం. యూపీఏ కావొచ్చు, ఎన్డీఏ కావొచ్చు వాళ్లు ప్రవేశపెట్టే చాలా నిర్ణయాలకు తమిళ ఎంపీల మద్దతు అవసరం. 39 మంది ఎంపీలు ఉన్న తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఏకతాటిపైనే ఉంటూ వచ్చింది. పార్టీలు వేరైనా రాష్ట్ర ప్రయోజనాలు అంటే మాత్రం ఏకమైపోతారు అక్కడి రాజకీయ నేతలు. అందుకే జాతీయ పార్టీల వ్యూహాలు అక్కడ పనిచేయడం లేదు. పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు ఇలా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించినది ఏదైనా సరే కేంద్ర ముక్కుపిండి మరీ తమిళ పార్టీలు పట్టుకెళ్ళిపోతాయి. అందుకే ఎలాగైనా సరే తమిళ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి పట్టు బిగించాలనేది పవన్, ఆయన ఢిల్లీ స్నేహితుల అజెండాగా కనబడుతోంది.తన సనాతన ధర్మ పరిరక్షణ ప్రసంగాలతో సంచలనం సృష్టిస్తున్న పవన్ మొదట్లో తమిళ నటుడైన కార్తీ, అక్కడ బాగా పట్టున్న ప్రకాష్ రాజ్‌ను టార్గెట్ చేసినట్టు కనిపించినా.. నిన్న పేరు చెప్పకపోయినా ఉదయనిధి స్టాలిన్‌ను విమర్శించినా తమిళ రాజకీయాలను దృష్టిలో పెట్టుకునే అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అన్నామలై లాంటి వాళ్ళ ఆవేశ పూరిత రాజకీయాల ద్వారా తమిళ ప్రజల్లోని ఒక సెక్షన్‌లో ప్రభావం పెంచుకుంది బీజేపీ. ఇప్పుడు సినీ రంగంలో పవర్ స్టార్ స్థాయిలో ఉన్న తమ స్నేహితుడు పవన్‌ని ఉపయోగించుకుని తమిళనాట బాగా చొచ్చుకుపోయే వ్యూహం పన్నిందనేది పొలిటికల్ ఎనలిస్టుల అంచనా. దానికి తగ్గట్టుగానే పవన్ అడుగులు కదుపుతున్నారని అందుకే పనికట్టుకుని మరీ తమిళ ఇంటర్వ్యూలు, తమిళ స్పీచ్‌లు ఇస్తూ తమిళ ప్రజల అభిమానం పొందే పనిలో పడ్డారనే వాదన కూడా వినిపిస్తోంది. అసలే తమిళ నాట భాషాభిమానం, సినీ అభిమానం ఓ రేంజ్ లో సక్సెస్ అయిన ఫార్ములాలు. వాటికి తోడు సనాతన ధర్మ రక్షకుడిగా ఓ కొత్త వాదనతో తమిళ రాజకీయాల వైపు పవన్ అడుగులు వేస్తున్న దృశ్యం చాలా స్పష్టంగా కనబడుతుంది అన్న పొలిటికల్ అంచనాలు ఎంతమేర నిజమవుతాయో చూడాలి.


# కూటమిలో ఎవరికి వారే...



**నెల్లూరు, అక్టోబరు 5, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇటీవలే వంద రోజులు దాటింది. అయితే పిఠాపురం నుంచి ఆదోని వరకూ, ధర్మవరం నుంచి ఒంగోలు వరకూ కూటమి పార్టీల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. కూటమికి ముందు కుదిరిన పొత్తులతో మూడు పార్టీలు ఏకమై జగన్ ప్రభుత్వాన్ని అయితే ఓడించగలిగారు కానీ, తమ నియోజకవర్గంలో గెలిచిన నేతలు ఆధిపత్యాన్ని సహించలేకపోతున్నారు. ఇగోలు విభేదాలకు ప్రధాన కారణం. ఎవరి పార్టీ వారిదే. ఎవరి జెండా వారిదే. ఎవరి అజెండా వారిదే. తమ పార్టీ క్యాడర్ కోసమే కూటమి పార్టీలు పట్టుబడుతుండటంతో మిత్రపక్షాలకు చెందిన నేతల్లో విభేదాలు రచ్చకెక్కాయని చెప్పక తప్పదు. ఇందులో ఏ పార్టీ నేతదీ తప్పు కాదు.ఎందుకంటే ఎవరి క్యాడర్ ను వారు కాపాడుకోవాలి. ఎవరి జెండాను వారు పదిలంగా ఉంచుకోవాలి. 2024 ఎన్నికలలో కూటమి పార్టీల క్యాడర్, నేతలు అందరూ కలసికట్టుగా పనిచేశారు. టిక్కెట్ దక్కకపోయినా కలసి మెలసి జెండాలను మోశారు. అయితే కూటమి పార్టీల మధ్య ఎన్నికల అనంతరం మాత్రం విభేదాలు అధినాయకత్వాలను కలవరపెడుతున్నాయి. ప్రధానంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహించే పిఠాపురంలోనూ టీడీపీ, జనసేనల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రభుత్వం ఏర్పాటయిన నెల రోజుల నుంచే అసంతృప్తితో ఉన్నారు.అక్కడ జనసేన నేతలకు, వర్మకు మధ్య గ్యాప్ బాగా పెరిగింది. లోకల్ నాయకత్వం మధ్య అస్సలు పొసగడం లేదు. తాజాగా పిఠాపురం అర్బన్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలకు అమితుమీ సిద్ధమవుతున్నారు టీడీపీ, జనసేన నేతలు. ఈ ఎన్నికలు పార్టీ గుర్తు లేకుండా జరిగేవి అయినా అధికారం ఉన్న పార్టీలు డైరెక్టర్ల పదవులను పంచుకుని ఏకగ్రీవం చేసుకునే వీలుంది. ఐదు డైరెక్టర్ల పోస్టులకు నోటిఫికేషన్ వెలువడగానే జనసేన నేతలు తమ అభ్యర్థులను రంగంలోకి దించారు. దీంతో వర్మ కూడా తన అనుచరులను పోటీకి దించి సై అన్నారు. రెండు పార్టీల నుంచి చెరో ఐదుగురు పోటీ చేస్తుండటంతో రెండు పార్టీల మధ్య పోటీ అనివార్యమయింది. ఒక రకంగా రెండు పార్టీలూ బలనిరూపణకు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి.ఆదోని నియోజకవర్గంలో అక్కడి సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుకు మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు పొడసూపాయి. ఇద్దరు వేర్వేరుగా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో క్యాడర్ కూడా రెండుగా విడిపోయారు. ఆధిపత్య పోరే దీనికి కారణమని తెలుస్తోంది. ఇక ధర్మవరంలో బీజేపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు టీడీపీ నేతలకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ నియామకం ఇందుకు కారణం. ఒంగోలులో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. జనసేనలో చేరిన బాలినేని వదిలేది లేదని చెబుతున్నారు. ఇవి కేవలం ఉదాహరణ మాత్రమే అనేక నియోజకవర్గాల్లో కూటమి పార్టీల నేతల మధ్య రచ్చ రంబోలా పార్టీ అధినేతలకు తలనొప్పిగా మారనున్నాయి. ధర్మవరంలో ఎన్నికల ముందు వరకూ ఉన్న ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ను కాదని కూటమి ఏర్పడిన తర్వాత ఆ స్థానాన్ని బీజేపీకి కేటాయించింది. అప్పటి వరకూ తానే విజేత అని భావిస్తున్న నాటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సత్యకుమార్ ను ఎంపిక చేయడంతో గెలుపు తనదేనని భావించారు. అయితే టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు సమిష్టిగా పనిచేసి ధర్మవరంలో కేతిరెడ్డిని స్వల్ప ఓట్ల మెజారిటీతో ఓడించగలిగారు. మిగిలిన నియోజకవర్గాల్లో యాభై వేలకు పైన వచ్చి మెజారిటీలు ధర్మవరానికి వచ్చేసరికి మాత్రం రెండు వేలకు మించలేదు. అయినా అందరూ కలసి పనిచేయడంతోనే సత్యకుమార్ విజయం సాధించారు/అయితే అదృష్టం సత్యకుమార్ ఇంట్లోనే ఉంది. కేవలం ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా బీజేపీలో నమ్మకమైన నేతగా ఉన్న ఆయనకు చంద్రబాబు కేబినెట్ లో మంత్రి పదవి లభించింది.

హేమాహేమీలను పక్కన పెట్టారు. సత్యకుమార్ కు అత్యంత కీలకమైన వైద్య ఆరోగ్య శాఖను అప్పగించారు. కానీ సత్యకుమార్ మాత్రం వైసీపీ స్థానిక నేతలను దగ్గరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. టీడీపీ, జనసేన కంటే వైసీపీ నేతలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అక్కడ విమర్శలు బాహాటంగా చేస్తున్నారు. మరోవైపు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి ప్రధానమైన వారిని దూరం చేయడానికే సత్యకుమార్ వైసీపీ వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ సమయంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డికి అనకూలంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ధర్మవరానికి సత్యకుమార్ తీసుకురావడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. టీడీపీ కేంద్ర కార్యాలయానికి కూడా పెద్దయెత్తున ఫిర్యాదులు అందాయి. తమను వేధించిన కమిషనర్ ను సత్యకుమార్ కావాలనే మున్సిపల్ కమిషనర్ గా తీసుకు వచ్చారంటూ టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. మరోవైపు పరిటాల శ్రీరామ్ కూడా సత్య కుమార్ వ్యవహారశైలిపై అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. ఆయన బహిరంగంగా బయట పడకపోయినా, ఆయన వర్గీయులు మాత్రం రోడ్ల మీదకు వచ్చి ఆందోళనకు దిగడం ఇప్పుడు ధర్మవరంలో టీడీపీకి ఇబ్బందిగా మారింది. దీనిపై సత్యకుమార్ తో చర్చించి సమస్యను పరిష్కరించాలన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు తెలిసింది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# సీఐడీకి జెత్వానీ కేసు




**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:** ఏపీలో వివాదంగా మారిన ఓ హీరోయిన్ కేసు ఇప్పుడు చేతికి వెళ్లబోతుందట. ఇప్పటికే బెయిల్ కోసం ఫైట్ చేస్తున్న ఆ ఆఫీసర్లకు..సీఐడీ గుబులు వెంటాడుతోందట. ఆ నటి కేసులో కొత్త కొత్త ట్విస్ట్‌లు ఉంటాయా.? ఇంకొందరు ఐపీఎస్ ఆఫీసర్స్ మెడకు చుట్టుకోబోతోందా.? పవర్‌లో ఉన్నప్పుడు ఏం చేసినా నడుస్తుంది. అనుకున్నోడి మీద కేసు పెట్టొచ్చు. తప్పు చేయనోన్ని కూడా ఇరకాటంలో పడేయొచ్చు. పర్మిషన్లు, చట్టాలు ఇవేవి అడ్డురావు. అందుకే అధికారం ఇచ్చే కిక్కే వేరు. అలాగని సమయం కలసి రాకపోతే అరాచకానికి మూల్యం చెల్లించుకోక కూడా తప్పదు. పవర్ చేతిలో ఉన్నప్పుడు ఏది పడితే అది చేశారు. ప్రభుత్వం మారింది. పాపాల చిట్ట బయటపడుతుంది. ఒకటా రెండా..స్యాండ్, మైన్, వైన్..చెప్పుకుంటూ పోతే పెద్ద కథే ఉంది. అంతేకాదు ఓ హీరోయిన్ కేసు కూడా కొందరు అధికారుల మెడకు చుట్టుకుంది. రేపోమాపో ముంబై నటి జత్వానీ కేసును సీఐడీకి ఇవ్వబోతున్నారట. దీంతో ఉన్న హెడెక్ చాలదని..ఇప్పుడు కొత్త లొల్లి వచ్చిపడబోతుందని పిసుక్కుంటున్నారట ఆ అధికారులు. మాకేం తెలియదని వాళ్లు.. మీ వెనక ఉన్నదెవరో చెప్పాలని పోలీసులు దీంతో రోజురోజుకు కేసు జఠిలం అవుతుంది. ప్రస్తుత పరిస్థితి చూస్తే హీరోయిన్ కేసులో ఆ అధికారులకు ముప్పుతిప్పలు తప్పేలా లేవు.ముంబై నటి జెత్వానీ కేసు దర్యాప్తును సీఐడీకి ఇస్తూ రేపోమాపో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందంటున్నాయి ప్రభుత్వం వర్గాలు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు సీనియర్ ఐపీఎస్ పిఎస్సార్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్ని సస్పెండ్ అయ్యారు. మరికొందరు పోలీసు అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే నలుగురు పోలీసులతో పాటు సీనియర్ ఐపీఎస్ అధికారులు, మరో న్యాయవాది బెయిల్ కోసం హైకోర్టుకెళ్లారు. అయితే ఇంకో సీనియర్ ఐపీఎస్ అధికారి పాత్ర ఉందన్న ఆరోపణలతో ఈ కేసును సీఐడీ కి అప్పగించేందుకు సర్కార్ కసరత్తులు చేస్తోంది.ముగ్గురు అధికారుల సస్పెన్షన్, వారి మీద నమోదైన కేసులు ఒక ఎత్తు అయితే.. ఇప్పుడు ఈ ఎపిసోడ్‌లోకి మరో కొత్త కేరక్టర్ ఎంటరైందని అంటున్నారు. సీనియర్ ఐపీఎస్ ల మీద దర్యాప్తు జరుగుతున్న క్రమంలో మాజీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి పేరు కూడా తెరపైకి రావడం సంచలనం అవుతోంది. జెత్వానీ కేసులో నేరుగా నాటి డీజీపీ పేరు లేకున్నా.. పరోక్షంగా ఆయన వ్యవహారశైలిపైనే అధికార వర్గాల్లో చర్చ జరుగుతోందట. డీజీపీగా, స్టేట్ పోలీస్ బాస్‌గా ఈ కేసు విషయంలో ఏం జరుగుతోందో తెలిసి కూడా రాజేంద్రనాథ్ రెడ్డి ఆపలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎంక్వైరీ స్టార్ట్ అయితే..మాజీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి నోటీసులు ఇస్తారని పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌సైడ్ టాక్ వినిపిస్తోంది. అంతేకాదు ఈ కేసులో సస్పెండ్ అయిన ఐపీఎస్ ఆఫీసర్లు పిఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా, విశాల్ గున్నిలపై గతంలో ఏమైనా ఆరోపణలు ఉన్నాయా..? అనే కోణంలో కూడా ప్రభుత్వ పెద్దలు ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. అందరికంటే ఎక్కువగా పిఎస్సార్ ఆంజనేయులు మెడకు ౦ఖఖూఅలో జరిగిన వ్యవహారాలు చుట్టుకోబోతున్నట్టు టాక్.గ్రూప్స్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు.. వాల్యూయేషన్‌లో రకరకాల పద్దతులను ఫాలో అయ్యారనే అభియోగాలను తెరమీదకు వస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి మరింత సమాచారం సేకరించడంతో పాటు.. అవసరమైన సాక్ష్యాలను కూడా సిద్దం చేస్తున్నట్టు చెప్పుకుంటున్నాయి రాష్ట్ర పోలీస్ వర్గాలు. ఇదే జరిగితే పిఎస్సార్ మరిన్ని కేసుల్లో ఇరుక్కోవడం ఖాయమని అంటున్నారు. ఇలా జెత్వానీ కేసు కొత్త పుంతలు తొక్కబోతోంది. ముందు ముందు ఇంకెన్ని ట్విస్ట్‌లు ఉంటాయో, ఏయే మలుపులు తిరుగుతాయోనన్న ఉత్కంఠ పెరుగుతోంది.

## ఇలా అయితే ఎలా...

# వైసీపీ కేడర్ అంతర్మధనం



**కడప, అక్టోబరు 5, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి పెట్టకపోవడంపై పార్టీలో నేతల మధ్య చర్చ జరుగుతుంది. ఓటమి తర్వాత నేతలు ఓపెన్ అయిపోతున్నారు. జగన్ ఇలాగే వ్యవహారశైలి కొనసాగిస్తే పార్టీ ఎదగడం కష్టమేనని అంటున్నారు. ఎన్నికల వేళ తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకుని ఇప్పటికైనా నేతలకు పట్టున్న నియోజకవర్గాల్లో వారిని ఇన్‌ఛార్జులుగా నియమిస్తే క్యాడర్ ను కాపాడుకుంటారని చెబుతున్నారు. కానీ జగన్ కు మాత్రం ఇగో అడ్డం వస్తున్నట్లుంది. అందుకే ఆయన నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల నియామకంపై ఎలాంటి నియామకాలు చేపట్టలేకపోతున్నారు. జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమిస్తూ మళ్లీ నేతలపై పెత్తనానికి కొందరిని వదులుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలను అనేక మందిని నియోజకవర్గాలను బదిలీ చేశారు. ఒకరి నియోజకవర్గాలకు వేరే వారిని అప్పగిస్తూ టిక్కెట్లను కేటాయించారు. కానీ మొన్నటి ఎన్నికల్లో జగన్ వ్యూహం బెడిసి కొట్టింది. కేవలం పదకొండు నియోజకవర్గాల్లో మాత్రమే వైసీపీ విజయం సాధించింది. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చినా ఫలితం లేదు. వారిపై వ్యతిరేకత ఉందని మార్చారనుకున్నారు కానీ, తన ప్రభుత్వంపై ప్రజల్లో ఇంతటి వ్యతిరేకత ఉందని ఊహించ లేకపోయారు. అంచనా ఊహకు కూడా అందకపోవడంతోనే జగన్ అలాంటి నిర్ణయం తీసుకున్నారు. అంతా ఐప్యాక్ టీం చెప్పినట్లే చేశానంటూ చేతులు దులిపేసుకున్నారు. దీంతో అయిష?టంగానే ఆ నియోజకవర్గాలకు వెళ్లిన నేతలకు ఓటమి ఎదురు కావడంతో అక్కడ పార్టీని పట్టించుకోవడం మానేశారు. పాత వారు కూడా వదిలేశారు. దీంతో ఆ నియోజకవర్గాల్లో క్యాడర్ అనాథలుగా మారిపోయారు. నేతలు లేక క్యాడర్ కూడా చెల్లాచెదురు కాకముందే అక్కడ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించాల్సిన అవసరం ఉందన్నది పార్టీ నేతల అభిప్రాయం. పాత వారికే తిరిగి అవకాశమిస్తే వారు తిరిగి ఆ నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేస్తారంటున్నారు. కానీ జగన్ మాత్రం పార్టీని పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఆ నియోజకవర్గాల్లో నేతలు లేకపోవడంతో క్యాడర్ ను కూటమి ఎమ్మెల్యేలు లాగేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో వైఎస్ జగన్ ఇలా చేతులు ముడుచుకుని కూర్చుంటే రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీస పోటీ ఇచ్చేందుకు కూడా అవకాశముండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికీ వైసీపీని అభిమానించే క్యాడర్ అనేక మంది ఉన్నప్పటికీ వారికి అండగా నిలిచే నేత లేక డీలా పడిపోయింది. మరోవైపు అధికారంలో ఉన్నపార్టీ హామీలను అమలుపర్చకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి బయలుదేరింది. దానిని క్యాష్ చేసుకునేందుకు లీడర్లు అవసరం. కానీ జగన్ ఇలా కాలయాపన చేస్తూ వెళితే పార్టీ చేతుల్లో నుంచి చేజారిపోతుందన్న ఆందోళన నేతల్లో కనిపిస్తుంది కాని జగన్ లో మాత్రం వీసమెత్తు కనిపించడం లేదని, తిరిగి తనవల్లనే పార్టీ పుంజుకుంటుందన్న ధోరణిలో ఉన్నారంటున్నారు నేతలు. మరి జగన్ తీసుకునే నిర్ణయంపైనే పార్టీ ఆధారపడి ఉంటుందన్నది పార్టీ బలంగా వినిపిస్తున్న టాక్.

# భారీ స్కెచ్ తో ఢిల్లీకి చంద్రబాబు



**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:** కేంద్రంలో ఈసారి చంద్రబాబు పాత్ర పెరిగింది.గత ఐదేళ్లుగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు చంద్రబాబు. రాష్ట్రంలో అధికారానికి దూరం కాగా..కేంద్రంలో కూడా పరపతి తగ్గింది. అటు బిజెపి అగ్రనేతలు పట్టించుకోలేదు. వారిని కాదని ఇతర జాతీయ పార్టీలతో సంబంధాలు ఏర్పరచుకోలేదు చంద్రబాబు. అయితే ఈ ఎన్నికల్లో అనూహ్యంగా చంద్రబాబు ఇమేజ్ పెరిగింది. రాష్ట్రంలో ఒంటరిగానే టిడిపి 134 అసెంబ్లీ స్థానాలను సాధించింది. కూటమిపరంగా 164 సీట్లతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. తెలుగుదేశం పార్టీ సొంతంగా 16 ఎంపీ సీట్లలో గెలిచింది. కూటమిపరంగా 21 సీట్లతో సత్తా చాటింది. అయితే గత రెండుసార్లు కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ సొంతంగానే అధికారంలోకి రాగలిగింది. కానీ ఈసారి మెజారిటీకి అల్లంతా దూరంలో నిలిచిపోయింది బిజెపి బలం. సరిగ్గా అటువంటి సమయంలోనే నేనున్నాను అంటూ చంద్రబాబు ఎన్డీఏ ఊపిరిలూదారు.మూడోసారి ఎన్డీఏ సుస్థిరతకు చంద్రబాబు అవసరం అనివార్యంగా మారింది. దీంతో చంద్రబాబు ఇమేజ్ అమాంతం పెరిగింది. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి చేరింది. టిడిపి కూటమి ప్రభుత్వంలో బిజెపి భాగస్వామ్యం అయ్యింది. అయితే చంద్రబాబు ఇక్కడే ఒక ఎత్తుగడ వేశారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ కేంద్రం సాయాన్ని పొందేలా పక్కాగా ప్లాన్ చేశారు. అందులో భాగంగానేఅమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్లో 15 వేల కోట్ల రూపాయల సాయం దొరికింది.పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సైతం నిధుల కేటాయింపు జరిగింది. ఈ ఐదేళ్లపాటు ఇలానే సాఫీగా వెళ్లిపోవాలని చంద్రబాబు భావిస్తున్నారు. వీలైనంత వరకు భారీగా కేంద్రం నుంచి నిధులు సమీకరణ చేయాలని భావిస్తున్నారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్న ప్రతిసారి రాష్ట్రానికి ఏదో ఒక ప్రయోజనందక్కుతూ వస్తోంది.ఈ తరుణంలో ఈ నెల ఏడున చంద్రబాబు ఢిల్లీ వెళ్ళనున్నారు. దీంతో కేంద్ర సాయం పై ఇప్పుడే చర్చ ప్రారంభం అయ్యింది.చంద్రబాబు రెండు రోజులు పాటు ఢిల్లీలో ఉండనున్నారు. ఈనెల 7న ఢిల్లీ బయలుదేరి వెళ్తారు. 8వ తేదీ సాయంత్రం తిరిగి అమరావతికి వస్తారు. ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా విశాఖ ఉక్కు పై కేంద్ర ఆర్థిక, ఉక్కు శాఖల మంత్రుల ఆధ్వర్యంలో జరిగే కీలక సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో భేటీ అవుతారని తెలుస్తోంది. అయితే దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఏపీకి రావలసిన కీలక ప్రాజెక్టులతోపాటు అమరావతి రాజధాని, పోలవరం నిర్మాణం పై వారితో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.మరోవైపు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను చంద్రబాబు కలిసి చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విశాఖ రైల్వే జోన్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. కేంద్రం ఆమోద ముద్ర వేసిన విషయం విధితమే. విశాఖ రైల్వే జోన్ భూమి పూజ ముహూర్తం పై రైల్వే శాఖ మంత్రి తో చర్చించబోతున్నట్లు సమాచారం. రాజధాని అమరావతికి ప్రపంచ బ్యాంకు నిధులు, పోలవరం అంశం పైన చర్చించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రానికి వరద సాయంతో పాటు ఇతర కేంద్ర ప్రాజెక్టులు, ఏపీకి సంబంధించిన ముఖ్య అంశాలపై కేంద్ర పెద్దలతో సీఎం చర్చిస్తారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# మానేరు వాగులో మహిళ ఆత్మహత్యాయత్నం కాపాడిన కానిస్టేబుల్

**కరీంనగర్ పెన్ పవర్:** సిరిసిల్ల సమీపంలోని మానేర్ వాగులో దూకి అంబేడ్కర్ నగర్ కు చెందిన మహిళాలక్ష్మీ ఆత్మహత్యాయత్నం చేసింది. మహిళను కానిస్టేబుల్ దేవరాజు కాపాడాడు. మనసు బాగాలేక కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించినట్లు మహిళ తెలిపింది. మహిళను కాపాడిన కానిస్టేబుల్ దేవరాజును ఎస్పీ అఖిల్ మహజన్ అభినందించారు. చిన.